ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



ప్రాజెక్టులు, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి

- వలసల నివారణకు కృషి
- ప్రభుత్వ సంక్షేమం ప్రతి ఇంటికి చేరాలి
- సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేలా చర్యలు
- ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి దిశగా అడుగులు
- గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడాలి
- అమ్మ ప్రోత్సాహమే కలెక్టర్‌ను చేసింది ● కలెక్టర్ అట్టాడ సిరి



'ఐఏఎస్ పదోన్నతి వచ్చాక తొలిసారిగా చారిత్రాత్మక నేపథ్యం కలిగిన కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టడం అదృష్టంగా భావిస్తున్నా. గతంలో అనంతపురం జిల్లా జేసీగా పని చేయడంతో రాయలసీమ ప్రాంత పరిస్థితులపై అవగాహన ఉంది. జిల్లాను పట్టిపీడిస్తున్న వలసల నివారణ కోసం చర్యలు తీసుకుంటా. సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'సూపర్ సిక్స్ పథకాల' ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా బాధ్యతగా కృషిచేస్తానని' ఆ దిశగా వేగంగా అడుగులు వేస్తా అని కలెక్టర్ అట్టాడ సిరి పేర్కొన్నారు.

కర్నూలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రాజెక్టులు, పరిశ్రమలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని కలెక్టర్ సిరి పేర్కొన్నారు. శనివారం ఆమె జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు సహా అసంపూర్తిగా ఉన్న హంద్రీనీవా పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువలు పూర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్, కర్నూలు స్మార్ట్ సిటీగా అభివృద్ధి, హైకోర్టు బెంచ్ ఏర్పాటుపై ప్రత్యేకదృష్టి సారించి ప్రాధాన్యం ఇస్తానని అన్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ఆంధ్రజ్యోతి: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తమరికి ప్రత్యేక అభినందనలు. కలెక్టర్‌గా జిల్లా అభివృద్ధిలో ముద్ర ఉండబోతుందా..?

కలెక్టర్: థ్యాంక్స్ అండి..! నాకు ఐఏఎస్‌గా పదోన్నతి వచ్చాక తొలిసారిగా కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టా. ప్రభుత్వ ప్రాధ్యానత పనులకు తొలి ప్రాధాన్యం ఇస్తాను. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తుంది. ఆఫలాలు అర్హులైన ప్రతి ఇంటికి చేరేలా చూస్తాను. జిల్లా ప్రగతి కోసం చేయాల్సిన పనులపై ప్రణాళిక తయారు చేసి ఆ దిశగా ముందుకు వెళ్తాను.

ఆంధ్రజ్యోతి: జిల్లా అభివృద్ధి కోసం కలెక్టర్‌గా ఎలాంటి ప్రాధాన్యతలు గుర్తించారు?

కలెక్టర్: ఈ రోజే బాధ్యతలు తీసుకున్నా. వివిధ శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహించా. పశ్చిమ ప్రాంత పల్లెల్లో కరువు, వలసల తీవ్రత అధికంగా ఉందని గుర్తించాను. తాగునీటి సమస్యలు కూడా ఉన్నాయి. హైకోర్టు బెంచ్ ఏర్పాటు, కర్నూలు స్మార్ట్ సిటీగా అభివృద్ధి చేయాలి. ఉపాధి అవకాశాలు మెరుగు పరచడం ద్వారా వలసలు నివారించొచ్చు. సీఎం చంద్రబాబు దృష్టికి తీసువెళ్లి ప్రాధాన్యత క్రమంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రతి ఇంటికి చేరేలా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తా.



ఆంధ్రజ్యోతి: జిల్లాలో వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు సహా హంద్రీనీవా ప్రాజెక్టు పత్తికొండ జలాశయం కుడి, ఎడమ కాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. ఆ ప్రాజెక్టులు పూర్తి చేయడంపై ఎలాంటి దృష్టి సారిస్తారు?

కలెక్టర్: ఈప్రాజెక్టులు పూర్తిచేస్తే కరువు, వలసలు నివారించొచ్చు. భూగర్భజలాలు కూడా పెరుగుతాయి. తాగునీటి సమస్యకు శాశ్వతంగా చెక్ పెట్టవచ్చు. మొదట ఇరిగేషన్ ఇంజనీర్లతో ప్రాజెక్టులపై సమీక్షలు నిర్వహించి ఏయే ప్రాజెక్టు ఏ దశలో ఉంది? ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయా? వెళ్లి ఉంటే ఏదశలో ఉన్నాయి? వంటి వివరాలు తెలుసుకోవాల్సి ఉంది. సమగ్ర వివరాలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పూర్తిచేయడానికి కృషిచేస్తా.

ఆంధ్రజ్యోతి: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ అభివృద్ధి కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటారు?

కలెక్టర్: ఓర్వకల్లు ఇండస్ట్రియల్ నోడ్ జిల్లా ముఖ చిత్రాన్నే మార్చేసే భారీ ప్రాజెక్టు ఇది. సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టిపెట్టారు. ఇప్పటికే జైరాజ్ ఇస్పాత్ ఐరన్ పరిశ్రమ, గ్రీన్‌కో సంస్థ నిర్మించిన పిన్నాపురం పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. పలు భారీ పరిశ్రమలు ఏర్పాటు కోసం ప్రభుత్వంతో ఒప్పందం జరిగింది. ఇండస్ట్రియల్ కారిడార్‌ను అభివృద్ధి చేస్తే మరిన్ని పరిశ్రమలు వచ్చే అవకాశం ఉంది. ఆద్వారా నిరుద్యోగ సమస్య కూడా తీరుతుంది. నోడ్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తాను. పరిశ్రమలు.. ప్రాజెక్టులు పూర్తిచేస్తే జిల్లా సమగ్రాభివృద్ధి సాధిస్తుంది. ఆ దిశగా నా కృషి ఉంటుంది.



మంత్రి టీజీ భరత్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ సిరి

ఉద్యోగ ప్రస్థానం

శ్రీకాకుళంలోని పార్వతీపురం ఆర్డీవోగా తొలి పోస్టింగ్. తూర్పు గోదావరి జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా, తూర్పు గోదావరి, ప్రకాశం జిల్లాల్లో జేసీ-2గా పనిచేశా. 2015లో ఐఏఎస్ పదోన్నతి వచ్చాక అనంపురం జిల్లా విలేజ్, వార్డు సచివాలయం జేసీగా విధులు నిర్వహించా. రాయలసీమ ప్రాంత పరిస్థితులపై కొంత అవగాహన ఉంది. స్త్రీశిశు సంక్షేమం, అభివృద్ధి శాఖ డైరెక్టరు, సర్వే ఆఫ్ విలేజెస్ అండ్ మ్యాపింగ్ విత్ ఇంప్రూవైజ్డ్ టెక్నాలజీ స్పెషల్ కమిషనర్, ఏపీఎస్ఏసీఎస్ ఎండీ, సెకండరీ హెల్త్ శాఖ డైరెక్టర్‌గా వివిధ హోదాల్లో బాధ్యతలు నిర్వర్తించా. తొలిసారిగా కర్నూలు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించాను.

అమ్మ ప్రోత్సాహంతోనే..

మాది శ్రీకాకుళం జిల్లా. అమ్మ ఎ.లలిత, నాన్న ఎ.లక్ష్మణరావు పుట్టిపెరిగిన ప్రాంతం అది. నాన్న గ్రూప్-2లో విజేతగా నిలిచి వాణిజ్య పన్నుల విభాగంలో ఏసీటీవోగా బాధ్యతలు చేపట్టారు. ఉద్యోగరీత్యా నాన్న విశాఖపట్నంలో స్థిరడ్డారు. అదే శాఖలో డిప్యూటీ కమిషనర్‌గా పదవీ విరమణ పొందారు. నేను పుట్టి పెరిగింది విశాఖలోనే. ఎల్‌కేజీ నుంచి మెడిసిన్ వరకు నా విద్యాభ్యాసం అంతా అక్కడే సాగింది. ఆంధ్ర మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ ఫైనలియర్‌లో ఉండగా గ్రూప్-1 నోటిఫికేషన్ వచ్చింది. నాకైతే డాక్టర్ అవ్వాలని బలమైన కోరిక ఉండేది. నాన్నకు కూడా వైద్యురాలిగానే సేవలు అందించాలని అనేవారు. అమ్మ మాత్రం నన్ను గ్రూప్-1 పరీక్షలు రాయమని ప్రోత్సహించింది. అప్పటికే నాకు డాక్టర్ సురేశ్‌తో వివాహం కావడంతో నా భర్త కూడా అమ్మమాట కాదనకు అంటూ ప్రోత్సహించారు. అలా గ్రూప్-1కు దరఖాస్తు చేయడం, తొలి ప్రయత్నంలోనే ఉత్తమ ఫలితం సాధించా. హౌస్ సర్జన్ చేస్తుండగా గ్రూప్-1 ఇంటర్వ్యూకు హాజరై ఎంపికయ్యా. ఈరోజు కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టానంటే అమ్మ ప్రోత్సాహమే. మాకు ఇద్దరు పిల్లలు సంతానం.

● డాక్టర్ అట్టాడ సిరి, కలెక్టర్

'మేము కర్నూలు కోసం'...

● స్వచ్ఛ సిటీ కోసం ప్రచారం : కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ విశ్వనాథ్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగరాన్ని 'క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా' మార్చేందుకు ప్రజల్లో చైతన్యం కలిగేలా సామాజిక మాధ్యమాల్లో విస్తృత ప్రచారం చేయాలని కార్పొరేషన్ కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులకు పిలుపునిచ్చారు. శనివారం నగర పాలక కార్యాలయంలో సోషల్ మీడియా ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ నగర అభివృద్ధి, పరిశుభ్రత, పచ్చదనం, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి అంశాల్లో ప్రజల్లో చైతన్యం కలిగించడానికి విస్తృత ప్రచారం అవసరమన్నారు. దీని కోసం 'మేము కర్నూలు కోసం' అనే అవగాహన కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. ప్రజల్లో చైతన్యం పెంచేలా సామాజిక మాధ్యమాల ప్రభావితులు వినూత్నమైన, ఆకట్టుకునే పోస్టులను సోషల్ మీడియాలో పోస్టు చేయాలని కోరారు. ప్రజలను చైతన్యపరుస్తున్న ప్రభావితులకు ప్రత్యేకంగా అవార్డులతో సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సోషల్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆందోళనలో అన్నదాతలు

● జిల్లాలో నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వాన
● జిల్లా సగటు వర్షపాతం 10.3 మి.మీ నమోదు
● చిప్పగిరిలో అత్యధికంగా 45.4 మి.మీ, కల్లూరులో అత్యల్పం 0.6 మి.మీ



కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఎడతెరిపి లేకుండా గత నాలుగు రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఉల్లి రైతులకు కంటి మీద కునుకు రావడం లేదు. పక్వానికి వచ్చిన ఉల్లిని విక్రయించుకుంటామో?, లేదా? అన్న ఆందోళన మొదలైంది. ప్రస్తుతం పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, ఆముదంతో పాటు కంది పంటలన్నీ ఈ నెలాఖరు గడిస్తే రైతులకు చేతికందే అవకాశం ఉంది. ఉధృత స్థాయిలో తెగుళ్ల, కీటకాలు ఇంకా వ్యాప్తి చెందలేదని, వర్షాలు తగ్గుముఖం పట్టి ఎండ కాస్తే పంటలు చేతికందుతాయని రైతులు చెబుతున్నారు. శనివారం జిల్లాలో సగటు వర్షపాతం 10.3 ఎంఎం నమోదు అయింది. చిప్పగిరి మండలంలో 45.4 ఎంఎం, గోనెగండ్లలో 35.8, ఆదోనిలో 33.4, కోసిగిలో 20.6, కోడుమూరులో 16.4 ఎంఎం వర్షపాతం నమోదు అయింది. అలాగే నందవరంలో 15.6, హొళగుందలో 15.4ఎంఎం, పెద్దకడుబూరులో 36.8, కౌతాళంలో 10.2, ఎమ్మిగనూరులో 8.2, తుగ్గలిలో 7.6, హాలహర్విలో 6.8, ఇతర మండలాల్లో 2.5 ఎంఎం వర్షపాతం నమోదైంది. పంటలను కాపాడుకునేందుకు రైతులు పొలాల్లో నిల్వ ఉన్న నీటిని బయటకు పంపించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి సూచించారు. పైర్లకు ఏమైనా తెగుళ్లు, కీటకాలు వ్యాపిస్తే రైతు సేవా కేంద్రాల్లో ఉన్న తమ సిబ్బంది, తనకు ఫోన్ చేసి తమ సూచనల మేరకు క్రిమిసంహారక మందులను వినియోగించాలని సూచించారు.

లోక్‌అదాలత్‌తో సత్వర న్యాయం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది
● ఒకేరోజు 8,122 కేసులు పరిష్కారం



లోక్ అదాలత్‌లో ప్రసంగిస్తున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి కబర్ది

కర్నూలు లీగల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కక్షిదారులు లోక్ అదాలత్‌ను ఆశ్రయిస్తే సత్వర న్యాయ సహాయాన్ని పొందవచ్చని కర్నూలు జిల్లా ప్రధాన న్యాయాధికారి జి.కబర్ది తెలియజేశారు. నగరంలోని న్యాయ సేవాసదన్ భవన్‌లో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ప్రాజెక్టు భూసేకరణలో నష్టపోయిన 60 మంది రైతులకు రూ.83,96,374 నష్టపరిహారాన్ని ఈ సందర్భంగా అందజేస్తున్నామని, గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను లోక్ అదాలత్‌ల ద్వారా సత్వరంగా పరిష్కరించినట్లు తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 20 లోక్ అదాలత్ బెంచీలను ఏర్పాటు చేసి కేసులను పరిష్కరించామని తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొత్తం 8,122 కేసులను పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయాధికారి కమలాదేవి, 6వ అదనపు జిల్లా న్యాయాధికారి వాసు, సీబీఐ కోర్టు జిల్లా న్యాయాధికారి శోభారాణి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు హరినాథ్ చౌదరి, శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ ఎం.వెంకట హరినాథ్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి మల్లేశ్వరి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి సరోజనమ్మ, జూనియర్ సివిల్ న్యాయాధికారి కిరణ్ కుమార్, కోర్టు మానిటరింగ్ సీఐ రామానాయుడు, పెద్ద సంఖ్యలో న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయానికి పెరిగిన వరద



ఏడు గేట్ల ద్వారా కొనసాగుతున్న నీటి విడుదల

● 7 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటి విడుదల

శ్రీశైలం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం పెరిగింది. ఈక్రమంలో శనివారం జలాశయం 7 రేడియల్ క్రస్ట్‌గేట్లను ఒక్కొక్కటి 10 అడుగుల ఎత్తు తెరిచి దిగువ సాగర్‌కు స్పిల్‌వే గుండా 1,93,634 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎగువన జూరాల స్పిల్‌వే, అలాగే విద్యుదుత్పత్తి అనంతరం, సుంకేసుల డ్యాం నుంచి మొత్తం కలిపి 2,24,166 క్యూసెక్కుల నీరు శ్రీశైలానికి వచ్చి చేరుతోంది. శ్రీశైలం రెండు జల విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి అనంతరం జెన్‌కో అధికారులు 66,280 క్యూసెక్యుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేశారు. డ్యాం నీటిమట్టం శనివారం సాయంత్రం 6గంటల సమయానికి 884 అడుగులుగా ఉండగా, నీటినిల్వ సామర్థ్యం 210 టీఎంసీలుగా నమెదు అయింది. శ్రీశైలం డ్యాం ఇంజనీర్లు గరిష్ఠ స్థాయి నీటినిల్వలు ఉంచుతూ వరద నీటిని సాగనంపుతున్నారు. డ్యాం గేట్లను తెరవడంతో సందర్శకులు తాకిడి పెరిగింది.

సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం

● డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ గోవిందరెడ్డి

7లో

జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

● రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్



7లో

హంద్రీకి నీటి విడుదల

● జీడీపీని సందర్శించిన ఇరిగేషన్ ఎస్ఈ

గోనెగండ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గాజులదిన్నె ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల్లో వర్షం ఎక్కువగా కురియడంతో జీడీపీకి వరద వచ్చి చేరుతుంది. దీంతో శుక్రవారం రాత్రి 4, 5 గేట్లను ఎత్తి 2వేల క్యూసెక్కులను విడుదల చేశారు. అయితే ఎగువ ప్రాంతాల నుంచి 15వేల క్యూసెక్కులు ఇన్‌ఫ్లో రావడంతో శనివారం ఉదయం పది గంటలకు రెండు గేట్ల ద్వారా 10వేల క్యూసెక్కులను హంద్రీనదికి విడుదల చేశారు. కాగా శనివారం సాయంత్రానికి ఇన్‌ఫ్లో తగ్గిపోయింది. ప్రస్తుతం 376.70 మీటర్లు (3.88 టీఎంసీలు) వరకు నీటిని నిల్వ ఉంచాలని అధికారులు నిర్ణయించారు. సాయంత్రం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో తగ్గిపోవడంతో 4, 5 గేట్లను రాత్రి మూసివేశారు. అనంతరం మూడో గేట్ తెరిచి వెయ్యి క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన మద్దికెర, పత్తికొండ, ఆస్పరి, తుగ్గలి ప్రాంతాలలో శుక్రవారం తెల్లవారుజామున భారీ వర్షాలు కురియడంతో వరద నీరు వచ్చి జీడీపీకి చేరింది. ఈ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి ప్రాజెక్టుకు 15వేల క్యూసెక్కులు చేరాయి.

ప్రాజెక్టును సందర్శించిన ఇరిగేషన్ ఎస్ఈ

గాజులదిన్నె ప్రాజెక్టును జిల్లా ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్రారెడ్డి, ఈఈ పాండురంగయ్య శనివారం సందర్శించారు. ప్రాజెక్టులో ఎంత నీరు ఉంది? ప్రస్తుతం ఇన్‌ఫ్లో ఎంత ఉంది?, అవుట్ గోయింగ్ ఎంత ఉంది? అని ఇరిగేషన్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే గేట్ల పరిస్థితిని కూడా తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలకుండా చూడాలని అధికారును ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీడీపీ ఏఈ మహమ్మద్‌అలీ, ఉగ్రనరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

కోడుమూరు: గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో కోడుమూరు హంద్రీనదికి జలకళ సంతరించుకున్నది. నీటి ప్రవాహం ఎక్కువ కావడంతో పంచాయతీ మంచినీటి పథకాల వైపు నీటి ప్రవాహం ముంచుకురావడంతో ముందుస్తు జాగ్రత్తగా అధికారులు మోటార్లను తొలగించారు. దీని ఫలితంగా తాగునీటికి కొంత అంతరాయం వాటిల్లుతుందని అధికారులు ప్రజలకు తెలిపారు.



శనివారం 10వేల క్యూసెక్కుల నీటిని హంద్రీని వదిలిన దృశ్యం

తుంగభద్ర తీరం

సాహిత్యం

నవరసాల సమాహారమే పుంజుతోక



కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పక్షి జాతిలో కోడిపుంజుకు ఒక ప్రత్యేకత ఉంది. అది వేకువ జామునే నిద్రలేపడానికి నాటి పెద్దలకు కూతల గడియారంలా పనిచేసేది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ కోడికూతతోనే రైతుల లోగిళ్లు తెల్లవారుతాయి. పల్లెల్లో పెరిగే పుంజుకోడి దర్పమే వేరు. రాజసంలా ఠీవిగా నిలబడి, రెక్కలను ఆర్చి.. గొంతు సవరించుకొని అది వేసే 'కొక్కొరో...కో..!' కూత వీనుల విందు చేస్తుంది. సమస్త వర్ణాలు కోడిపుంజు ఈకల్లో మిరమిట్లు గొలిపినట్లే.. నవరసాలతో కూడిన కవితా సుమాలు ఇందులో కలిసి దర్శనం ఇవ్వడం వల్ల కవి పుస్తకానికి ఈ వైవిధ్యమైన పేరు ఎంచుకున్నారు. 'పుంజుతోక' నామకరణ చేయడం రచయితలోని కొత్త ఆలోచనా విధానాన్ని వ్యక్తం చేస్తుంది. పుస్తక ముఖచిత్రం, శీర్షిక కొంత చిత్రంగా, హాస్యంగా, ఆకట్టుకునే విధంగా నిలుస్తుంది. సామాజిక స్పృహ, ప్రకృతిపై ప్రేమ వీరి ప్రధాన వస్తువులు. కళాశాల రోజుల నుంచి పోలీసు శాఖలో వివిధ హోదాలు నిర్వహిస్తూ పదవీ విరమణ పొందేదాకా, దాదాపు ముప్పయ్ సంవత్సరాల మధ్యకాలంలో రచించిన వివిధ రకాల అనుభూతులను ఏర్చి, కూర్చి ఇప్పుడు మనకు అందించారు ఈ ఇండియన్ పోలీస్ సర్వీస్ (ఐపీఎస్) కొత్తకోట శ్రీనివాసరెడ్డి. సి.బెళగల్ మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన రచయిత శ్రీనివాసరెడ్డి ఐపీఎస్ అధికారిగా తెలంగాణ రాష్ట్రంలో వివిధ హోదాల్లో పనిచేస్తూ విజిలెన్స్ శాఖ డీజీపీగా ఇటీవల పదవీ విరమణ చేశారు. ఆయన రాసిన పుంజుతోక కవితా సంపుటిని ఆదివారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ప్రముఖ సాహితీవేత్తలు ఆవిష్కరించనున్నారు. ఈ సంపుటిలో ఎన్నో హాస్య, వ్యంగ కవితలు అక్కడక్కడ తళుక్కుమని మెరిసి నవ్విస్తాయి. చురుక్కుమనిపిస్తాయి. కవి నిజాయితీ, స్వచ్ఛత కవితల నిండా కనిపిస్తుంది. దీర్ఘ సమాసాలు, అర్థంకాని పదబంధాలు, సంస్కృత భూయిష్ఠమైన వాక్య నిర్మాణాలు లేకుండా చాలా సరళంగా, మనస్సుకు హత్తుకునేలా, సూటిగా వ్యవహారిక భాషలో రాసిన వచన కవితల సంపుటిని ముందుకు తీసుకురావడంలో రచయిత కొత్తకోట శ్రీనివాసరెడ్డి కృషి శ్రమ చాలా కనిపిస్తుంది. వృత్తిరీత్యా నిత్యం ఎన్నో సవాళ్లతో, నిరంతర ఒత్తిడి మధ్య కూడా వాటిని జయించి ఈ పుస్తకాన్ని తీసుకొచ్చారు.



● డాక్టర్ ఎం.హరికిషన్, కథా రచయిత, కర్నూలు


మతోన్మాద శక్తులను ఓడించండి: గఫూర్



మాట్లాడుతున్న గఫూర్

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వామపక్ష, ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతతో మతోన్మాద శక్తులను ఓడించాలని సీపీఎం మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎం.ఎ గఫూర్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్ఎస్ ఫంక్షన్‌హాలులో సీతారాం ఏచూరి మొదటి వర్ధంతి సందర్భంగా 'వర్తమాన రాజకీయాలు- సీపీఎం వైఖరి' అనే అంశంపై పాతబస్తీ కార్యదర్శి రాజశేఖర్ అధ్యక్షతన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గఫూర్ మాట్లాడుతూ సీతారాం ఏచూరి భారత రాజకీయాల్లో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. దేశంలో అన్ని రాజకీయ పార్టీలు ఒకే వేదికపై వచ్చేలా కృషి చేసిన మొదటి వ్యక్తి అని కొనియాడారు. సీతారాం ఏచూరి గొప్ప మేధావి అని కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నాయకులు జి.రామక్రిష్ణ, అలివేలమ్మ, ఎం.విజయ్‌నరసింహులు, నగేష్ పాల్గొన్నారు.

అవిశ్రాంత యోధుడు



వైద్యం సహకారంతో టీటీడీ ముద్రించిన శ్రీ మహాభాగవతములు 8 భాగాల పుస్తకాలు



వైద్యం వెంకటేశ్వరాచార్యులు


తెలుగు భాషకు మూడు వేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న విషయం ఎవరికైనా తెలుసా..? దాన్ని మొట్టమొదటిసారిగా బయట పెట్టింది ఆయనే. అప్పటి వరకు దక్షిణాదిలో తమిళమే అత్యంత ప్రాచీన భాషగా భుజాలు చరుచుకునే ఆ ప్రాంత భాషావేత్తల మధ్యే, మద్రాసు యూనివర్సిటీలో 'తెలుగే అత్యంత ప్రాచీన భాష'గా రుజువులు చూపించి ఒప్పించారు. జిల్లాలో ఆదిమానవుడు నడయాడిన కేతవరం గుహల గురించి.. బేతంచెర్ల పరిసర ప్రాంతాల్లోని గుహల గురించి.. ఉమ్మడి జిల్లాకు సంబంధించిన అనేక చారిత్రక కట్టడాల గురించి, నదీతీర ప్రాంతాల్లోని నాగరికత గురించి అక్షర రూపంలో వెలుగులోకి తీసుకువచ్చింది కూడా ఆయనే. అమరావతిలో లభించిన తొలి తెలుగు శాసనంలోని తెలుగు పదంగా పేర్కొనే 'నాగబు' కన్నా.. కర్నూలు జిల్లాలో లభించిన 14 శాసనాల్లోని 'అందిర' అనే పురాతన తెలుగు పదం ఉందని చాటి చెప్పిన చరిత్ర పరిశోధకుడు ఆయన. టీటీడీ చేపట్టిన అనేక మహా మహా పురావస్తు గ్రంథాలు, ఏళ్ల నాటి తాళపత్ర గ్రంథాలను పునఃరచనల ద్వారా నేటి తరానికి అందించిన సాహిత్య ఘనశాలి ఆయన. కవిగా, రచయితగా, పరిశోధకుడిగా, భాషావేత్తగా బహుముఖ రూపాల్లో రాణిస్తున్న ఆయనే వైద్యం వెంకటేశ్వరాచార్యులు. 76 ఏళ్ల ప్రాయంలోనూ ఆయన సాగిస్తున్న సాహిత్య జైత్ర యాత్రలో వందలాది పురస్కారాలు, సత్కారాది బిరుదులు ఆయన కీర్తి కిరీటంలో కలికితురాయిలా నిలిచిపోయాయి.

- 160కి పైగా పుస్తకాలు రచించిన తెలుగు సాహితీవేత్త
- అముద్రితాలుగా మరో 64 గొప్ప రచనలు
- జిల్లా చరిత్ర, పురావస్తు విజ్ఞానంపై పరిశోధనలు
- 56 ఏళ్లుగా సుదీర్ఘ సాహితీ ప్రస్థానంలో వైద్యం వెంకటేశ్వరాచార్యులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోడుమూరు మండలంలోని రేమట గ్రామానికి చెందిన చెందిన కృష్ణమ్మ, వైద్యం పురుషోత్తమాచార్యులకు ఏకైక సంతానం వైద్యం వెంకటేశ్వరాచార్యులు. ఉపాధ్యాయుడైన తండ్రి వద్దే ప్రాథమిక విద్య అభ్యసించారు. 1971లో డిగ్రీ పూర్తి చేసిన ఆయన 1972లో సిల్వర్ జూబ్లీ కళాశాల్లో స్టోర్ కీపర్‌గా ఉద్యోగం లభించింది. అదే ఏడాది గద్వాలకు చెందిన పుష్పావతమ్మతో వివాహం అయింది. వీరికి ఒక కుమారుడు వైద్యం రాజగోపాల్. అనంతరం దూర విద్యా విధానంలో ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంఏ పూర్తి చేశారు. 1999 వరకు సిల్వర్ జూబ్లీ కళాశాల్లో, నంద్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో ఉద్యోగం చేసి, తర్వాత జూనియర్ లెక్చరర్‌గా, ప్రిన్సిపాల్‌గా పదోన్నతిపై 2006 వరకు బనగానపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో పనిచేసి, అక్కడే పదవీ విరమణ చేశారు. 2003లో ఆటవెలదిలో 'తెలుగు భాష' అనే గ్రంథాన్ని తీసుకువచ్చారు. 2004లో 'వ్యాస జయంతి'లో జిల్లాకు సంబంధించిన సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక అంశాలను పరిశోధనాత్మకంగా ముద్రించారు. 2005లో ఉన్నమాట పేరుతో 136 ఆటవెలది సూక్తులతో శతకం రాశారు. 2011లో 'కర్నూలు జిల్లా కవి తరంగిణి' పేరుతో జిల్లా కవుల చరిత్రను పరిశోధనాత్మకంగా రాశారు. ఇది ఎంతో ప్రామాణిక గ్రంథంగా జిల్లా వాసులకు సమాచారం అందిస్తుంది. వెయ్యేళ్లలో జిల్లాలోని కవులు, రచయితలను పరిచయం చేసిన అద్భుత గ్రంథంగా ఇది నిలుస్తుంది. కర్నూలులోని సుమారు 50 మండలాల్లోని గ్రామాలను, మహబూబ్‌నగర్‌లోని అనేక ప్రాంతాలను పర్యటించారు. జిల్లాలో లభించిన 14 శాసనాలను పరిశోధించి, అందులోని 'అందిర' అనే పదం ద్వారానే ఆంధ్రపదం పుట్టిందని, అదే తొలి తెలుగు పదంగా తన పరిశోధనల ద్వారా వెల్లడించారు. క్రీ.పూ. 3వేల ఏళ్లకు ముందే జిల్లాలోని అనేక గుహల్లో ఆదిమానవుల రాతలు, చిత్రాలు ఉన్నాయని పరిశోధనలతో నిరూపించారు. 1972లో అప్పటి జిల్లా కలెక్టర్ వీరపాండ్యన్, సిల్వర్‌జూబ్లీ అధ్యాపకుడు నాగభూషణంలతో కలిసి కేతవరం, బనగానపల్లె పరిసర ప్రాంతాల్లోని గుహలను వెలుగులోకి తీసుకువచ్చారు.

మూడు గ్రంథాలయాలు.. వేలాది పుస్తకాల సేకరణ


తెలుగు సాహిత్యంతో పాటూ వివిధ భాషలకు సంబంధించిన వేలాది పుస్తకాలను వైద్యం వెంకటేశ్వరాచార్యులు సేకరించారు. వందలాది అరుదైన తాళపత్ర, తామ్రపత్ర గంథాలను భద్రపరిచారు. కర్నూలు, బెంగళూరు, ఎమ్మిగనూరు ప్రాంతాల్లోని తన గృహాల్లో వాటిని భద్రపరిచారు. సుమారు మూడు వేలకు పైగా పుస్తకాలను కర్నూలు జిల్లా కేంద్ర గ్రంథాలయానికి బహూకరించారు. అలాగే మారుతి మెగా సిటీలోని దస్తగిరిరావు అనే సాహితీవేత్త నిర్వహించే గ్రంథాలయానికి 1,500 పుస్తకాలు అందజేశారు. హైదరాబాదు పురావస్తు గ్రంథాలయం వారు కొన్ని తాళపత్ర గ్రంథాలను తీసుకువెళ్లారు. ఒకప్పుడు సైకిల్‌పై గ్రామ గ్రామాన తిరుగుతూ, వారి వద్ద ఉన్న అరుదైన పుస్తకాలు ఆనాడు వందలాది రూపాయలు వెచ్చించి కొనడం, లేదా ఫొటోస్టాట్ కాపీలు తీయించి భద్రపరచడం చేశారు వైద్యం వెంకటేశ్వరాచార్యులు.




వ్యాస వైజయంతిక (మొదటి భాగం)

● టీటీడీ ద్వారా అనేక గ్రంథాలకు వెలుగుబాట...

సంస్కృతాంధ్ర భాషల్లో అనేక పౌరాణిక, చారిత్రక, ఇతిహాస గ్రంథాలను వెలుగు బాట పట్టించిన ఖ్యాతి వైద్యం వేంకటేశ్వరాచార్యులకు దక్కుతుంది. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ప్రతి తెలుగు వారూ గర్వించదగ్గ అంశంగా చరిత్రలో నిలిచిపోతుంది. అలాగే ఎన్నో తాళపత్ర గ్రంథాలను, శాసనాలను కూడా అయన పుస్తక రూపంలో తీసుకువచ్చారు. వేనేళ్ల సాహిత్య చరిత్రకు సంబంధించిన అనేక అంశాలను పుస్తక రూపంలో తీసుకువచ్చి, అక్షర రూపంలో నిక్షిప్తం చేశారు. సుమారు పదేళ్లకు పైగా తిరుపతిలోని టీటీడీ ముద్రణల విభాగంలో పనిచేస్తూ రామాయణ, భాగవతాది గ్రంథాలను పద్య అర్థ రూపంలో తెలుగువారికి అందించారు. కర్నూలు జిల్లాకు చెందిన సుమారు 800 మంది కవులు, పండితులు, రచయితలను పరిచయం చేస్తూ గొప్ప పరిశోధన గ్రంథం తీసుకువచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది.



వైద్యం రాసిన పుస్తకం 'కర్నూలు జిల్లా కవి తరంగిణి'



'తొలి తెలుగు ఆధ్యాత్మ రామాయణము' పుస్తకం

ఎన్నో పరిశోధన పత్రాల సమర్పణ...

దేశంలోని వివిధ విశ్వవిద్యాలయాలు నిర్వహించిన సెమినార్లలో అనేక పరిశోధన పత్రాలు సమర్పించారు. 12 పరిష్కృత గ్రంథ రచనలు చేశారు. ఎన్నో పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. 220 గ్రంథాలకు పీఠికలు, 500 గ్రంథాలకు ముందు మాటలు రాశారు. తెలుగు భాషలోని అన్ని దిన, వార, పక్ష, మాస, త్రైమాసిక పత్రికల్లో 300పైచిలుకు రచనలు ప్రచురితమయ్యాయి. ఆకాశవాణి కడప, హైదరాబాదు, కర్నూలు కేంద్రాల్లో సాహితీ చర్చల్లో పాల్గొన్నారు. కర్నూలు ఆకాశవాణిలో సూక్తిసుధ పేరుతో 6 ధారావాహికలు ప్రసారం అయ్యాయి.

భవిష్యత్తులో రావాల్సిన రచనలు ఎన్నో..

ప్రస్తుతం తాను రాసిన 160కి పైగా గ్రంథాలతోపాటూ 64 వరకు గొప్ప గ్రంథాలు ముద్రించాల్సి ఉందని వైద్యం వెంకటేశ్వరాచార్యులు తెలిపారు. వీటిని మరింత సమగ్రంగా, లోతుగా మరోసారి అధ్యయనం చేశాక పుస్తకాల రూపంలోకి తీసుకువస్తానని ఆయన చెబుతున్నారు. అలాగే మొదట తెలుగు భాషలో చిత్ర కవిత్వం రాయాలని తలంచారని, అది కాకుండా 'ప్రపంచ భాషల్లో చిత్ర కవిత్వం' అనే మహాద్భుత భాషా రచనను ముద్రిస్తున్నానని తెలిపారు. అలాగే జిల్లాకు సంబంధించిన అనేక వెలుగు చూడని చారిత్ర అంశాలను కూడా భావి తరాలకు తెలియజేస్తూ పుస్తకాన్ని తీసుకువస్తున్నట్లు ఆయన తెలిపారు.

కళ

తనూజయం



- ● పుట్టుకతోనే మాటలు రావు.. చెవులు వినపడవు
- ● దివ్యాంగత్వాన్ని జయించి.. భరతనాట్యంలో రాణించి..!
- ● భళా అనిపించుకుంటున్న బోయ తనూజ

పుట్టుకతోనే ఆ అమ్మాయి మూగ, చెవిటి. అయినా నిరాశ చెందలేదు. జీవితంలో ఓ లక్ష్యాన్ని నిర్ణయించుకుంది. ఓటమిని అంగీకరించకుండా గెలుపే లక్ష్యంగా సాగింది. తల్లిదండ్రులు ఆమెను ప్రోత్సహించారు. భరతనాట్యంలో శిక్షణ ఇప్పించారు. మేటి నాట్యకారిణిగా తీర్చిదిద్దారు. ఆరో తరగతి చదువుతూనే నాట్యంలో అద్భుత ప్రతిభను కనబరుస్తోంది బోయ తనూజ. దేశవిదేశాల్లో ప్రదర్శనలిస్తూ ప్రశంసలు అందుకుంటోంది.

కోసిగి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన బోయ జిలేబి శ్రీధర్, మంజులవాణి దంపతులకు ముగ్గురు కూతుళ్లు. మొదటి ఇద్దరు కుమార్తెలు జనని, తనూజలు పుట్టకతోనే చెవిటి, మూగవారిగి జన్మించారు. మూడో కూతురు మాత్రం ఆరోగ్యంగా ఉంది. ఇద్దరు బిడ్డలు దివ్యాంగులుగా ఉన్నా ఆరోజుకు బాధపడ్డారు. అందరిలాగా వారిని కూడా తీర్చిదిద్దాలని అనుకున్నారు. అందుకు రెండో కూతురు తనూజను ఆదోనిలో దేశాయి భరతనాట్యం అకాడమీలో చేర్పించారు. ఆమె ఆదోనిలో ఆరో తరగతి చదువుతోంది. భరతనాట్యంలోనూ ప్రతిభ కనబరుస్తోంది.

ప్రదర్శనలతో ప్రశంసలు

తనూజ చిన్ననాటి నుంచే భరతనాట్యంపై ఆసక్తి పెంచుకుంది. ఇది గమనించిన తల్లిదండ్రులు శ్రీధర్, మంజులవాణి దేశాయ్ నాట్యమండలిలో శిక్షణ ఇప్పించారు. ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ భరతనాట్యం ప్రదర్శనలిచ్చి పలువురిని ఆకట్టుకుంది. మలేషియాలో సైతం భరతనాట్యంలో ప్రతిభ కనబరిచింది. రెండో స్థానంలో నిలిచి మంచి పేరు తీసుకువచ్చింది. భరతనాట్యంలో రాణిస్తుండటంతో కోసిగి పేరును వేరే దేశంలోనూ గుర్తింపు తీసుకురావడం తనూజకే సాధ్యమైందని పలువురు కొనియాడుతున్నారు. పెద్దకూతురు బోయ జనని డ్రాయింగ్‌లో రాణిస్తుంది. భరతనాట్యంలో తనూజ మంచి ప్రదర్శన చేసి మరిన్ని అవార్డులు సాధించాలని తల్లిదండ్రులు, గ్రామస్థులు కోరుతున్నారు.



మలేసియాలో అవార్డు అందుకుంటున్న తనూజ



శ్రీశైలంలో ఉగాది మహోత్సవంలో భరతనాట్యం చేస్తున్న తనూజ



గురువు దేశాయితో

ప్రజల్లో చైతన్యం తీసుకువస్తున్నాం

● జేవీవీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేవీవీ ప్రజా చైతన్య కార్యక్రమాలతో ప్రజల్లో చైతన్యం తీసుకువస్తుందని ఆ వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి. విశ్వనాథ్ అన్నారు. శనివారం నగరంలోని బిర్లా కాంపౌండ్‌లో గల జేవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో జన విజ్ఞాన వేదిక (జేవీవీ) చేపట్టిన ఉపన్యాస జాతా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శని, ఆదివారాల్లో ఈ జాతాలో మాట, పాట, ఆట, మ్యాజిక్ షోలపై శిక్షణ ఉంటుందన్నారు. చదువు, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మహిళా సాధికారత అంశాలపై కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. దొంగ బాబాలను నమ్మవద్దని, వారు ఏ మహిమలు చూపినా నాలుగు సూత్రాల ద్వారానే చేస్తారన్నారు. హస్తలాఘవం, దాచి ఉంచిన భాగం, సైన్సు సూత్రాలు, సహాయకున్ని అందుబాటులో పెట్టుకొని వారి చేత ప్రజలను బురిడీ కొట్టిస్తారని తెలిపారు. గాలిలోంచి విభూది తీయడం, గాలిలో కూర్చోవడం, నిప్పును మింగడం, చేతిలో హారతి ఇవ్వడం వంటివన్నీ ఈ నాలుగు పద్ధతుల్లోనే అమలు చేస్తారని వివరించారు. సైన్సు సార్వత్రికమని, సత్యం త్రికాలాల్లో ఒకటిగా ఉంటుందన్నారు. జేవీవీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏవీ రమణయ్య మాట్లాడుతూ నీళ్లు పెట్రోలుగా మారడం, బంగారు రెట్టింపు అవడం, మగపిల్లలను పుట్టిస్తామని చెప్పడం వంటి అంశాలతో దొంగబాబాలు, స్వామిజీలు, ఫకీర్లను దూరంగా పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమానికి 10 జిల్లాల నుంచి 50 మంది కళాకారులు హాజరయ్యారు. జేవీవీ నాయకులు శేషాద్రినాయుడు, మహమ్మద్ మియా, బి. సురేష్, హరేరాం, ఖాజవలి, మాణిక్యం రిసోర్సు పర్సన్లుగా వ్యవహరించారు.

అపూర్వ బంధం

● వారి మైత్రీకి 40 వసంతాలు ● కలుకుసున్న టీటీసీ తొలి బ్యాచ్ విద్యార్థులు



నలభై ఏళ్ల అనంతరం కలుసుకున్న టీటీసీ తొలిబ్యాచ్ పూర్వ విద్యార్థులు

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఒకటి కాదు, రెండు కాదు...ఏకంగా నలభై ఏళ్ల అనంతరం వారంతా కలిశారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. అలనాటి జ్ఞాపకాల జడివానలో తడిపి ముద్దయ్యారు. తరగతి గదుల్లో ఒకరినొకరు పిలుచుకున్న నిక్‌నేమ్‌లు, కళాశాల్లో చేసిన చిలిపి పనులు, గురువులతో తిన్న చీవాట్లు అన్నీ మళ్లీ ఒకసారి నెమరువేసుకొంటూ మురిసిపోయారు. ఆ కళాశాల్లో నలభై ఏళ్ల నాడు తాము కూర్చున్న తరగతి గదులు, కళాశాల ఆవరణలోని చెట్టు తనివితీరా వీక్షిస్తూ కన్నీటి చెలమలతో ఆనందబాష్పాలు రాల్చారు. కర్నూలులోని గడియారం ఆసుపత్రి సమీపంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల ఇందుకు వేదికైంది. 1984-85 నాటి ప్రభుత్వ టీచర్ ట్రైనింగ్ బ్యాచ్ విద్యార్థులు శనివారం కలుసుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం ఈ పాఠశాల్లోనే టీటీసీ కళాశాలను ఏర్పాటు చేసింది. ఇక్కడ చదువుకున్న విద్యార్థులంతా ఉపాధ్యాయ ఉద్యోగాలు, ఇతర ఉద్యోగాలు సాధించి వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడ్డారు. వారంతా ఈ పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొని సంతోషంగా గడిపారు. భవిషత్తులో ఏటా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిద్దామని నిర్ణయించారు. ఈ సందర్భంగా ప్రముఖ కథా రచయిత ఎస్ఎండీ ఇనాయతుల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తొలిసారిగా టీటీసీ కేంద్రాన్ని కర్నూలులో ఇక్కడే ఏర్పాటుచేసిందని, తామంతా తొలిబ్యాచ్‌గా ఇక్కడ చదువుకున్నామని గుర్తుచేశారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు బోధించిన నాటి ఉపాధ్యాయులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ప్రస్తుత పాఠశాల హెచ్ఎం పుష్పరాజ్, సీనియర్ ఉపాధ్యాయుడు షుకూర్‌లకు తమ తరపున క్రీడా సామగ్రి బహూకరించారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పూర్వ విద్యార్థులు మాలతి, సావిత్రి, ఫౌజియా, ఉషారాణి, విశ్వమోహన్, యూనుస్, మౌలాలి పాల్గొన్నారు.

మహానందిలో ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్

మహానంది, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో శనివారం రాత్రి ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా వీరికి ఏపీ టూరిజం గెస్ట్ హౌస్ వద్ద టూరిజం డీవీఎం లక్ష్మీనారాయణ స్వాగతం పలికారు. అనంతరం ఆలయం వద్ద వీరికి అర్చకులు స్వాగతం పలికారు. ప్రధాన ఆలయాల్లో చైర్మన్ అభిషేకార్చన పూజలు నిర్వహించారు. కల్యాణ మండపంలో వీరిని వేదపండితులు ఆశీర్వదించారు. ఇన్‌చార్జి పర్యవేక్షకుడు పసుపుల సుబ్బారెడ్డి శాలువాతో సన్మానించి, స్వామివారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట తెలుగుగంగ డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ క్రాంతికుమార్ యాదవ్, ఆర్ఎస్ శ్రీనివాసులు, ఏపీ టూరిజం అధికారులు ఉన్నారు.



వేదపండితుల ఆశీర్వాదం పొందుతున్న ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ

మూగజీవాలకు గ్రాసమై..



ఉల్లి పంట రైతుకు కన్నీళ్లు తెప్పిస్తోంది. గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు పంటను మూగజీవాలకు గ్రాసంగా వదిలేస్తున్నారు. శనివారం గోనెగండ్లకు చెందిన చాకలి బ్రహ్మయ్య అనే రైతు తాను సాగు చేసిన రెండున్నర ఎకరాల ఉల్లి పంటను మూగజీవాలకు గ్రాసంగా వదిలారు. రూ. 1.50 లక్షల పెట్టుబడి పెట్టాడు. క్వింటం ఉల్లి ధర రూ. 500 నుంచి రూ. 600 పలకడంతో రైతు దిగాలు చెందాడు. ఇతడే కాక మండల కేంద్రానికి చెందిన మరో ఐదు మంది రైతులు సైతం దాదాపు పది ఎకరాల్లో ఉల్లి సాగు చేశారు. గిట్టుబాటు ధరలు లేకపోవడంతో పొలాల్లోనే మూగజీవాల కోసం గ్రాసంగా వదిలేశారు. కొందరు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. కొన్ని చోట్ల గ్రామస్థులు ఉచితంగా ఉల్లిని కోసుకొని వెళ్తున్నారు. ● గోనెగండ్ల, ఆంధ్రజ్యోతి



రైతు కష్టం నేలపాలు.. ఉల్లిగడ్డలను తీసుకువెళ్తున్న జనం



జీవాలకు ఆహారంగా.. ఉల్లి పంటను మేస్తున్న మూగజీవాలు

ఉల్లి అమ్మకాలు త్వరగా జరపండి

- వ్యాపారుల కొనుగోళ్లపై నిఘా పెట్టండి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ ఏ.సిరి



ఉల్లిని పరిశీలిస్తున్న కలెక్టర్ సిరి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి ఉల్లిగడ్డలను క్వింటానికి రూ.1,200 ప్రకారం కొనుగోలు చేసి అమ్మకాల కోసం రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు పంపేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ విభాగాలు ఈ విషయంలో సమన్వయంతో పని చేయాలని సూచించారు. శనివారం కర్నూలు మార్కెట్ యార్డులో రైతుల నుంచి మార్క్‌ఫెడ్ అధికారులు కొనుగోలు చేస్తున్న ఉల్లిని కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మార్క్‌ఫెడ్ డీఎం రాజు మాట్లాడుతూ రైతుల నుంచి కొనుగోలు చేసిన ఉల్లిని రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు పంపడంతో పాటు స్థానికంగా హోల్‌సేల్ వ్యాపారులు, డీలర్లు, విద్యాసంస్థలు, హాస్టళ్ల యజమానులకు విక్రయిస్తున్నట్లు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ పూర్తిగా పక్వానికి వచ్చిన ఉల్లిని మార్కెట్ యార్డుకు తీసుకురావాలని సూచించారు. జేడీ రామాంజనేయులు, డీడీ ఉపేంద్ర, ఏడీఎంలు సత్యనారాయణ చౌదరి, నారాయణమూర్తి, సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, చైర్‌పర్సన్ అజ్మీత్ బీ, వైస్ చైర్మన్ శేషగిరిశెట్టి, సెక్రటరీలు వెంకటేశ్వర్లు, సుందర్‌రాజు, సూపర్‌వైజర్లు కేశవరెడ్డి, నగేష్, శివన్న పాల్గొన్నారు.

కుందూ నదిలో వృద్ధురాలి గల్లంతు



ఫకూర్ బీ (ఫైల్)

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని రూపనగుడి గ్రామ కుందూ నది వంతెన వద్ద ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన పూల ఫకూర్ బీ గల్లంతైనట్లు తహసీల్దారు ప్రసాద్‌బాబు తెలిపారు. శనివారం ఉదయం వంతెనపై నుంచి నదిలోకి దూకినట్లు స్థానికులు అంబటి రమణయ్య, గగ్గెర తిక్కయ్య తెలిపారన్నారు. ఆమె కోసం ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టామన్నారు. కుందూ వంతెన వద్ద తమ వీఆర్వోలతో గస్తీ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు తెలిపారు. కుందూలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున అటువైపు ఎవరూ వెళ్లవద్దని ఆయన సూచించారు.

బోధనేతర పనులు రద్దు చేయాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు పాఠశాలల్లో బోధనేతర పనులను రద్దు చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకు నేందుకు గానూ.. ఈ నెల 15వ తేదీ నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి కార్యక్రమాన్ని చేపడు తున్నట్లు తెలిపారు. శనివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రణభేరి కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఐదు బృందాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భారీ సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కూటమి ప్రభుత్వం కూడా అమలు చేస్తోం దన్నారు. గత విద్యా సంవత్సరానికి ప్రస్తుత విద్యాసం వత్సరానికి ప్రభుత్వ పాఠశాలలో లక్షన్నర మందికి పైగా విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేష్ కుమార్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరిహారం



చెక్కులను పంపిణీ చేస్తున్న న్యాయాధికారి సుధ

ఆదోని, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదోనిలో జాతీయ లోక్ అదాలత్ జరిగిన విచారణలో రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన బాధితా కుటుంబాలకు రూ.1.35 కోట్లు నష్టపరిహారం చెక్కులను రెండవ జిల్లా న్యాయాధికారి పేజీ సుధ పంపిణీ చేశారు. వివిధ బీమా సంస్థల ద్వారా బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లింపునకు సంబంధించి సత్వర నిర్ణయాలు తీసుకోవడం ద్వారా వారిలో న్యాయ వ్యవస్థపై నమ్మకం పెరిగిందన్నారు. లోక్‌అదాలత్ వంటి వేదికల ద్వారా ప్రజలు తక్కువ ఖర్చుతో త్వరితగతిన న్యాయం పొందవచ్చని, ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనవసరంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ డబ్బు, సమయం వృథా చేసుకోవద్దని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కోర్టు బెంచ్ మెంబర్ లోకేష్‌కుమార్, బీమా కంపెనీల న్యాయవాది చకోలి గిరిధర్, ఇతర సీనియర్, జూనియర్ న్యాయవాదులు హాజరయ్యారు.

మందుబాబులకు జరిమానా

కర్నూలు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 79 మందుబాబులకు కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్ ఆధ్వర్యంలో నగరంలో పలు చోట్ల డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించారు. వీరందరినీ శనివారం కోర్టులో హాజరు పరచగా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున మొత్తం రూ.3.95 లక్షలు జరిమానా విధిం చిందని సీఐ మన్సూరుద్దీన్ తెలిపారు.

చెరువులో నీరున్నా.. ఉపయోగం లేదన్నా

- పూర్తిగా నిండిన జొన్నగిరి చెరువు
- ముళ్లకంపతో నిండిన 192 ఎకరాల భూమి
- అభివృద్ధి చేస్తే సాగుచేయొచ్చంటున్న రైతులు



ముళ్లకంపతో నిండిన 192 ఎకరాల ఆయకట్టు



పూర్తిగా నిండిన జొన్నగిరి చెరువు

తుగ్గలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నగిరి చెరువు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిండింది. అయినా రైతులకు ఉపయోగం లేకుండా పోయింది. దాదాపు 192 ఎకరాల ఆయకట్టు భూముల్లో కంపచెట్లు ఉండటంతో నిరుపయోగంగా మారింది. 20 ఏళ్ల క్రితం వరి పండించేవారమని, వర్షాలు కురువకపోవడం, ఇతర చెరువుల నుంచి నీరు చేరకపోవడంతో 368 మంది రైతులకు పొలాలు భూములు బీడుబారాయి. అనంతరం ఎవరూ పట్టించుకోకపోవడంతో ముళ్ల కంప పెరిగింది. బీడ్లువారి కంపచెట్లు పెరిగిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వంలో చెరువుల మరమ్మతులు చేసి, ఆయకట్టును పట్టించుకోలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము శుభ్రం చేసుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు అవుతుందని తమ వల్ల కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కంపచెట్లు తొలగించి ఆయకట్టును సాగులోకి తీసుకురావాలని అందించాలని రైతులు కోరుతున్నారు.

నిధులు ఇవ్వాలి



ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే ఆయకట్టులో కంప తొలగిస్తాం. చెరువును అభివృద్ధి చేసి, గతంలో మాదిరిగానే పంటలు సాగుచేసే అవకాశం ఉంది. ● **గుంత రంగస్వామి, సాగునీటి సంఘం అధ్యక్షుడు, జొన్నగిరి**

కౌతాళంలో భారీ వర్షం

కౌతాళం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్పపీడన ప్రభావంతో శనివారంకౌతాళంలో సాయంత్రం భారీ వర్షం కురిసింది. సాయంత్రం 4గంటల నుంచి దాదాపు రెండు గంటల పాటు వర్షం దంచి కొట్టింది. దీంతో గ్రామంలో ఏ కాలనీ చూసినా చెరువులను తలపించేరీతిలో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైటిగేరి, కొండగేరి, శివప్పనగర్, అత్తార్ వీధి, వడ్డేగేరిలో నీరు ఇళ్లలోకి చేరడంతో ప్రజలు నీటిని బయటకు తోడేందుకు గంటలకుపైగా శ్రమించాల్సి వచ్చింది.



రెండో వార్డులో ఇళ్లలోకి చేరిన వర్షపు నీరు



వడ్డేగేరిలో మోకాల్లోతు నీరు

యువకుడి ప్రాణం తీసిన ఇస్త్రీ పెట్టె

వెలుగోడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోతుకూరు గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఓబులేసు (25) ఇంట్లో తన దుస్తులను ఇస్త్రీ చేసుకునేందుకు ఇస్త్రీ పెట్టెను ఆన్ చేశాడు. ఇస్త్రీ పెట్టె హీట్ అయిందో.. లేదో.. తెలుసుకోవడానికి ఇస్త్రీ పెట్టెను చేతితో తాకాడు. దీంతో ఓబులేసు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూరు ఆసుపత్రికి తరలించారు. యువకుడి తల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు వెలుగోడు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యం

- డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి



మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి

కర్నూలు అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో 99 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ఉన్నాయని, వాటిని బలోపేతం చేసేందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం కర్నూలు నగరంలోని హోటల్‌-కే ఫర్చ్యూన్‌లో విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన సంఘాల అభివృద్ధిపై సమీక్ష సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశంలో సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులకు రుణ బకాయిల రికవరీపై దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాలోని 99 సంఘాలకు గానూ ఇప్పటి వరకు కేవలం 46 సంఘాల్లో మాత్రమే రుణాలను రికవరీ చేశారని, ఇంకా 53 శాతం రికవరీ చేయాల్సి ఉందని, రూ.550 కోట్ల మేరకు బకాయిలు ఉన్నాయని, సాధ్యమైనంత తొందరగా ఈ బకాయిలను రాబట్టాలని సంఘాల సీఈవోలను ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల జిల్లాల టీడీపీ అధ్యక్షుడు తిక్కారెడ్డి, మల్లెల రాజశేఖర్, డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్, డీసీసీబీ సీఈవో రామాంజనేయులు, డీజీఎంలు నాగిరెడ్డి, ఉమామహేశ్వరరెడ్డి, సునీల్ కుమార్, ఏజీఎం త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సువర్ణావకాశం

రైతులపై రుణ భారాన్ని తగ్గించేందుకు బ్యాంకు చరిత్రలో మొదటి సారిగా దీర్ఘకాలిక రుణాలపై వడ్డీని తగ్గిస్తున్నట్లు చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి ప్రకటించారు. 11.10శాతం (93పైసలు) నుంచి 10.35 శాతం (86 పైసలు) తగ్గిస్తున్నట్లు తెలిపారు. అలాగే సంఘాల ద్వారా రైతులకు ఎరువులను పంపిణీ చేసేందుకు ఒక్కో సంఘానికి రూ.25 లక్షల పూచీకత్తును అందిస్తున్నామన్నారు. రుణ రికవరీ సాధిస్తామని హామీ ఇచ్చిన సంఘాలకు రూ.కోటి రుణ అలాట్మెంట్‌ను ఇవ్వనున్నట్లు చైర్మన్ ప్రకటించడంతో సంఘాల అధ్యక్షులు, సీఈవోలు హర్షం వ్యక్తం చేశారు.

జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాలి

- రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్
- సీఆర్ అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ప్రారంభం





మాట్లాడుతున్న మంత్రి భరత్, సీఆర్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మారుతున్న కాలానుగుణంగా జర్నలిస్టులు వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. నగరంలోని మౌర్యఇన్‌లోగల పరిణయ ఫంక్షన్‌హాలులో సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో, ఏపీయూడబ్ల్యూజే జిల్లా శాఖ సహకారంతో ఏర్పాటు చేసి న రెండు రోజుల 'గ్రామీణ విలేకరులకు పునశ్చరణ తరగతులు' ఘనంగా ఆరంభమయ్యాయి. ఈ శిక్షణల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి టీజీ భరత్ హాజరయ్యారు. సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావులతో కలిసి మంత్రి టీజీ భరత్ జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఆర్ మీడియా అకాడమీ చేపట్టిన విలేకరులకు శిక్షణ కార్యక్రమాలు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయన్నారు.

వృత్తి నైపుణ్యాలను అందించేందుకు కృషి

జర్నలిస్టుల వృత్తిపరమైన లక్ష్యాలకు ఎన్నో నైపుణ్యాలు అవసరమవు తున్నాయని, వాటిని అందించే దిశగా సీఆర్ అకాడమీ కృషి చేస్తుందని అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ అన్నారు. శిక్షణ తరగతుల కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆలపాటి మాట్లాడుతూ మనిషి నిత్య విద్యార్థి అని, ఏ వృత్తిలో ఉన్నా ఆ వృత్తిలో రాణించాలంటే శిక్షణలు అవసరమన్నారు. పాజిటివ్ జర్నలిజాన్ని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలని సూచించారు. ప్రభుత్వంలోని మంచి చెడులతోపాటూ మంచి డెవలప్‌మెంట్‌ను పాజిటివ్ దృక్పథంలో తెలియజేయాలన్నారు. ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని గ్రామీణ విలేకర్లు కూడా అందిపుచ్చుకోవాలనే సంకల్పంతో సీఆర్ మీడియా అకాడమీ రాష్ట్ర వ్యాప్తంగా ఈ శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ శిక్షణల్లో ఉదయం సెషన్‌లో 'ఆంధ్రజ్యోతి' కర్నూలు జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్‌కుమార్ నాయుడు 'డెస్క్ కో-ఆర్డినేషన్' అనే అంశంపై మాట్లాడారు. మధ్యాహ్నం సెషన్‌లో 'ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ)' అనే అంశంపై ఏఐ ట్రైనర్, సీనియర్ జర్నలిస్టు విజయ్‌కుమార్ కుర్రా తెలియజేశారు. కార్యక్రమాల్లో సమాచార శాఖ డీడీ జయమ్మ, ఐజేయూ జాతీయ సభ్యుడు నాగరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోరంట్ల కొండప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె. శ్యాంసుందర్‌లాల్, జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు, జిల్లా ప్రతినిధులు సుబ్బయ్య, కృష్ణారెడ్డి, శ్రీనివాసగౌడ్, అంజి తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ గోవిందరెడ్డి



చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డితో వైస్ చైర్‌పర్సన్ అరుణ, సభ్యులు

కర్నూలు హాస్పిటల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్‌గా డాక్టర్ కేజీ గోవిందరెడ్డి మళ్లీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కమిటీ కాలపరిమితి ఈ నెల 15వ తేదీ ముగియనున్న నేపథ్యంలో నూతన కమిటీని ఎన్నుకునేందుకు శనివారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సభ్యుల సమావేశం నిర్వహించారు. 7వేల మంది సభ్యులు ఉండగా.. 400 మంది సభ్యులు హాజరయ్యారు. జిల్లా రెవెన్యూ అధికారిణి సి.వెంకట నారాయణమ్మ అధ్యక్షతన ఎన్నికలు నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా వైస్ చైర్‌పర్సన్‌గా డీఎంహెచ్‌వో కార్యాలయ ఏవో కె.అరుణ, కోశాధికారిగా నరసింహ, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా జి.శ్రీనివాసులు, ప్రభాకర్ రెడ్డి, రఘునాథరెడ్డి, బాబురాజ్, డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, భీమశంకర్ రెడ్డి, ఎన్వీ సుబ్బారెడ్డి, మీనాక్షి ఎన్నికయ్యారు. ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యులతో డీఆర్వో ప్రమాణ స్వీకారం చేయించారు.

'ఎన్నికపై అధికారులకు ఫిర్యాదు చేశా'

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఎన్నికపై కలెక్టర్, డీఆర్వోకు ఫిర్యాదు చేశానని రెడ్ క్రాస్ సొసైటీ గత మేనేజింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్న ఐ.విజయకుమార్ రెడ్డి ఓ ప్రకటనలో ప్రశ్నించారు. మేనేజింగ్ కమిటీలో 17మంది ఉండగా.. 11 మందిని తనకు అనుకూలమైన సభ్యు లను తీసుకుని ప్రశ్నించే సభ్యులను తొలగించారని ఆయన ఆరోపించారు. కర్నూలు జిల్లాలో 7వేల మంది సభ్యులు ఉన్నారని, అయితే వంద మంది సభ్యులతో జిల్లా కమిటీకి ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఎన్నికలు నిబంధనల ప్రకారం జరగాయని, ఈ సమావేశానికి 400 మంది సభ్యులు హాజరయ్యారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ గోవిందరెడ్డి తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కర్నూలు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలో పూడూరు వెళ్లే రోడ్డులో తుంగభద్ర నదిలో గుర్తు తెలి యని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. స్థానికులు ఇచ్చిన సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై తెలుపు రంగు చొక్కా, డ్రాయర్ మాత్రమే ఉన్నాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినవారు 9121101063 నెంబరుకు సమాచారం ఇవ్వాలని సీఐ శ్రీధర్ తెలిపారు.

సీబీఎన్ బ్రాండ్‌తోనే రాష్ట్రానికి పెట్టుబడులు

మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీబీఎన్ బ్రాండ్ తోనే రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తున్నామని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓర్వకల్లు పారిశ్రామిక పార్క్‌కు భారీ పరిశ్రమలు రాబోతున్నాయన్నారు. ఇప్పటికే రూ.10వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామన్నారు. రాష్ట్రాల మధ్య పెట్టుబడులను ఆకర్షించడంలో గట్టి పోటీ నెలకొందని, అయినా జిల్లాలో రూ.1650 కోట్ల పెట్టుబడితో ఓర్వకల్లులో రిలయన్స్ కంపెనీ పనులు మొదలు పెట్టిందన్నారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చదువుతోపాటు భాషా నైపుణ్యాలు పెంచుకోవాలి

కర్నూలు కల్చరల్: విద్యార్థులు చదువుతోపాటూ భాషా నైపుణ్యాలు పెంచుకోవాలని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శనివారం నగరంలోని నెహ్రూరోడ్డులోని సత్యసాయి కళాక్షేత్రంలో 'షేపింగ్ టుమారోస్ ఫ్యూచర్' అనే అంశంపై ఏర్పాటు చేసిన సదస్సుకు ముఖ్య అతిథిగా మంత్రి టీజీ భరత్ హాజరై మాట్లాడారు. సత్యసాయి కళాక్షేత్రంలో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వ్యక్తిత్వ వికాస నిపుణుడు మండి అన్వర్ హుస్సేన్, రాంప్రసాద్, సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, పూర్వ అధ్యక్షుడు సాయిబాబా, కన్వీనర్ మాకా అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

రేపు పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక రాక్‌వుడ్ మెమోరియల్‌లో 1976 నుంచి 1986 వరకు చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ కలయిక ఈ నెల 15వ తేదీన ఉదయం 9.30 గంటలకు జరుగుతుందని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. శనివారం స్థానిక పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆత్మీయ కలయికకు పూర్వ విద్యార్థులంతా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

నేడు రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలు

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక దేవనగర్‌లోని గుడ్‌షపర్డ్ పాఠశాలలో ఆదివారం ఉదయం 9 గంటలకు 17వ రాష్ట్ర స్థాయి మిని సబ్ జూనియర్ హ్యాండ్‌బాల్ పోటీలను నిర్వహిస్తున్నట్లు హ్యాండ్‌బాల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు శనివారం తెలిపారు. అండర్-12 బాలబాలికల విభాగంలో ఈ చాంపియన్‌షిప్ నిర్వహిస్తున్నామని, పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఏపీ జట్టుకు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాదులో జరిగే 17వ జాతీయస్థాయి మినీ సబ్ జూనియర్ అండర్-12 హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు.

16, 17 తేదీల్లో చెస్ టోర్నీ

కర్నూలు స్పోర్ట్స్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ ఎంపీపీ దివంగత డి.రాజావర్దన్‌రెడ్డి జయంతి సందర్భంగా కర్నూలు కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఈనెల 16, 17వ తేదీల్లో అంతర్జాతీయ చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంటు నిర్వాహకులు రవినాయక్, కార్యదర్శి ఇమాం హుశేన్ తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని మాజీ డిప్యూటీ సీఎం కేఈ కృష్ణమూర్తి స్వగృహంలో ఆవి ష్కరించారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, ఎమ్మెల్యేలు దస్తగిరి, కేఈ శ్యాంబాబు హాజరయ్యారు.

గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలి

కర్నూలు కలెక్టరేట్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మైదాన ప్రాంత గిరిజనులకు అసెంబ్లీలో ప్రాతినిధ్యం కల్పించాలని శనివారం ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, కోడుమూరు కాంగ్రెస్ ఇన్‌చార్జి అనంతరత్నం, గిరిజన సంఘాల చైర్మన్ రామస్వామి, లంబాడి జాతీయ అధ్యక్షుడు యోగేష్ నాయక్‌లు ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్ కల్పించాలన్నారు. 2026లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో శాసనసభ స్థానాలు 175 నుంచి 225 పెంపునకు కొత్తగా ఏర్పాటు కానున్న ఆ నియోజకవర్గాల్లో మైదాన ప్రాంత గిరిజనులకు సామాజికంగా, ఆర్థిక, రాజకీయ ఉద్యోగ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు.

వ్యాకథాన్ ఫైనల్స్‌కు 'సిల్వర్ జూబ్లీ' విద్యార్థులు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అమరావతిలో జరగనున్న క్వాంటమ్ వ్యాలీ వ్యాకథాన్ ఫైనల్స్‌కు సిల్వర్ జూబ్లీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం సిల్వర్ జూబ్లీ కళాశాలలో నిర్వహించిన విద్యార్థుల అభినందన సభలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్లకు సన్మానం



కార్పొరేషన్ డైరెక్టర్లను సన్మానిస్తున్న బీసీ సంఘం నాయకులు

కల్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన పీబీవీ. సుబ్బయ్య, సుధాకర్‌లను బీసీ సంక్షేమ సంఘం నాయకులు శనివారం ఘనంగా సన్మానించారు. నగరంలోని కేయి.మాదన్న కమ్యూనిటీ హాల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు, టీడీపీ నాయకుడు కుమ్మరి రామకృష్ణ సహచరులతో కలిసి వారిని అభినందించారు. టీడీపీ సాధికార కమిటీ సభ్యుడు నరసింహబాబు, బీసీ సంఘం నాయకులు లింగన్న, శ్రీనివాసులు, మధు, ఎన్‌జీవో సంఘం మాజీ అధ్యక్షుడు నూగూరు వెంకటేశ్వర్లు, విశ్రాంత సీఐ నాగేశ్వరరావు, సంజీవకుమార్, రామచంద్రుడు, పెద్ద ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

ముజఫర్‌నగర్‌లో కార్డన్ సెర్చ్

కర్నూలు క్రైం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ముజఫర్‌నగర్‌లో పోలీసులు శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. డీఎస్పీ బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐలు విక్రమసింహ, మోహన్ కిషోర్, గోపినాథ్, రామమునయ్య తమ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. అనుమానితులు, పాత నేరస్తులు, రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు చేశారు. వాహన పత్రాలు సరిగ్గా లేని నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

ఆస్పత్రి ఉన్నా.. అందని వైద్యం

- సమయపాలన పాటించని వైద్యులు, సిబ్బంది
- ఆసుపత్రిపై పర్యవేక్షణ కరువు
- ప్రైవేటు ఆస్పత్రులకు పేదల పరుగులు
- హుశేనాపురం పీహెచ్‌సీలో పరిస్థితి ఇదీ..

అక్కడ ప్రభుత్వ వైద్యశాల ఉన్నా వృథానే.. రోగులకు సేవలదించే వారు లేరు. వైద్యం కోసం వెళ్లిన వారంతా ఉసూరుమంటూ వెనుదిరిగి రావాల్సిందే.. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించరు. పై అధికారుల పర్యవేక్షణ లేదు. ఫలితంగా రోగులు అప్పులు చేసి ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లి వేలకు వేలు ఖర్చు పెట్టుకుంటూ బాధపడుతున్నారు. హుశేనాపురం పీహెచ్‌సీలో పరిస్థితి ఇదీ..

ఓర్వకల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే ఉద్దేశ్యంతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. అయితే.. ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉన్నా వైద్యులు, సిబ్బంది సమయ పాలన పాటించక పోవడం, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. మండలంలోని హుశేనాపురం గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల కొరత ఉండటమే కాకుండా ఉన్న వైద్యులు కూడా విధులకు సక్రమంగా రావడం లేదని, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందకపోవడంతో రోగులు పలు ఇబ్బందులు పడుతూ ఓర్వకల్లు, కర్నూలు ఆసుపత్రులకు వెళ్లి తమ ఆరోగ్యాన్ని చూపించుకోవల్సిన పరిస్థితి నెలకొంది. ఈ ఆసుపత్రి 24 గంటలు వైద్యసేవలు అందించాల్సి ఉండగా.. అయితే.. వైద్యసేవలు అందడం లేదు. ఇద్దరు డాక్టర్లు, ముగ్గురు స్టాఫ్ నర్సులతో పాటు పది మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తారు. సాధారణ రోజుల్లో 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వ హించాలి. ఆదివారం సెలవు రోజు ఉదయం 9నుంచి మధ్యా హ్నం 12 గంటల వరకు పని చేయాలి. కానీ ఆదివారం వైద్యం కోసం ఆసుపత్రికి వచ్చే ప్రజలకు డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. 24 గంటల ఆసుపత్రి కావడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి రోజుకు వంద నుంచి 150 మంది వైద్యం కోసం ఆసుపత్రికి వస్తుంటారు. వైద్యులు సమయవేళలు పాటించకపోవడంతో మెరుగైన వైద్యం అందడం లేదని ప్రజలు



పీహెచ్‌సీలో వైద్యులు లేక ఖాళీగా ఉన్న కుర్చీ



హుశేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇదే

ఆరోపిస్తున్నారు. జాతీయ రహదారి పక్కనే ఆసుపత్రి ఉండటంతో రాత్రివేళల్లో వైద్యుల కోసం వాహనదారులు ప్రజలు ఆసుప త్రికి వెళితే.. నైట్‌వాచ్‌మెన్ మాత్రమే ఉంటారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే సీజనల్ వ్యాధులు జ్వరం, వాంతులు, విరేచనాలు తదితర రకాల రోగాలతో ప్రజలు నిత్యం పీహెచ్ సీకి వస్తుంటారు. అయితే.. వైద్యులు లేకపోవడంతో ఓర్వకల్లు సామాజిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చూపించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మందుబాబులకు అడ్డాగా పీహెచ్‌సీ

మందుబాబులకు పీహెచ్‌సీ ప్రాంగణం అడ్డాగా మారింది. రాత్రి వేళల్లో ఆసుపత్రి ప్రాంగణంలో మందుబాబులు విచ్చలవిడిగా మద్యం సేవించడమే కాకుండా సీసాలు పగులకొట్టడం, అల్లర్లు చేస్తున్నారని వీటిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

సమయపాలన పాటించండి



వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించి వారి మన్ననలు పొందాలి. గ్రామం నుంచి ఆసుపత్రికి రోగులు వస్తుంటారు. వారిపై శ్రద్ధ చూపి సేవలు అందిస్తే మంచి గుర్తింపు పొందుతారు.

● గువ్వ రవికుమార్, స్థానికుడు

మెరుగైన సేవలు అందిస్తాం

తాను పీహెచ్‌సీలో నూతనంగా బాధ్యతలు చేపట్టాను. ఇప్పటి నుంచి ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తాం. రోగులు స్వయాన తనను కలవాలన్నారు.

● డాక్టర్ సుప్రియ

సిబ్బందిని నియమించాలి



ఆసుపత్రిలో సిబ్బంది కొరత వల్ల రోగులకు వైద్యసేవలు అందడం లేదు. అలాగే ఉన్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందడం లేదు.

● బజారు, స్థానికుడు

నర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- రెగ్యులర్ సిబ్బందికి 8 ఏళ్లకు ఒకసారి బదిలీలు చేయాలి
- కాంట్రాక్టు, నర్సింగ్ సిబ్బందిని రెగ్యులర్ చేయాలి
- ఏపీ నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రాధమ్మ, కోటమ్మ

కర్నూలు హస్పిటల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న నర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ గవర్నమెంటు నర్సెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రాధమ్మ, కోటమ్మ డిమాండ్ చేశారు. శనివారం కర్నూలు జీజీహెచ్ ఓల్డ్ సీఎల్‌జీలో ఉమ్మడి జిల్లా నర్సెస్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షురాలు ఎం.లీలావతి అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ఏపీ ఎన్జీవో నాయకులు కాశన్న, ప్రభాకర్ రెడ్డి, శ్రీనివాసులు యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కడప జోన్-4 పరిధిలో డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్ పరిధిలో ఉన్న హెడ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ నర్సింగ్ సిబ్బందికి 8ఏళ్లకు ఒకసారి బదిలీలు నిర్వహించాలని, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు కూడా బదిలీలు చేయాలని కోరారు. పబ్లిక్ హెల్త్ స్టాం డర్స్ సూచనల మేరకు 24 గంటలు పనిచేసే పీహెచ్‌సీలో నాల్గవ స్టాఫ్ నర్సులను నియమించాలని కోరారు. ఉమ్మడి జిల్లా నర్సెస్ అసోసియేషన్ కార్యదర్శి సి.బంగారి, కోశాధికారి ఎస్.లక్ష్మి నరసమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జి.శాంతిభవాని, ఈసీ సభ్యులు శాంతిలత, ఎస్.సోమేశ్వరి, ఉషారాణి, ఏ.ఉమాదేవి, కృష్ణవేణి పాల్గొన్నారు.



అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

● ఎంపీ బస్తిపాటి నాగరాజు



మాట్లాడుతున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యమని ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. శనివారం నగరంలోని సుంకేసుల రోడ్డులో గల సెయింట్ జోసెఫ్స్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన జాబ్‌మేళాకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగాల కోసం యువతీ, యువకులతో మాట్లాడి చదువు, ఉద్యోగాల ప్రాముఖ్యతను తెలి పారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల కల్పనకు సీఎం. చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే రాష్ట్ర వ్యాప్తంగా నిరంతరం జాబ్ మేళాలు నిర్వహిస్తున్నారని, ప్రతి ఒక్కరూ సద్విని యోగం చేసుకోవాలని సూచించారు. కరువు, వలసలతో అల్లాడి వెనుకబడిన కర్నూలు జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందబోతుందన్నారు. ఓర్వకల్లు వద్ద డ్రోన్‌హబ్ తోపాటు సెమీ కండెక్టర్లు త్వరలో ఏర్పాటు కాబోతున్నాయని, వాటి ద్వారా జిల్లా వాసులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు.

కలెక్టర్‌కు అభినందనల వెల్లువ

కర్నూలు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా సిరి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కర్నూలు రెవెన్యూ డివిజనల్ ప్రెసిడెంట్ రామాంజ నేయులు, సెక్రెటరీ వేణుగోపాల్‌రావు నూతన కలెక్టర్‌కు బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కర్నూలు రూరల్, అర్బన్ తహసీలార్లు టి.వెంకటరమేష్ బాబు, రవికుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో డివిజనల్ ట్రెజరర్ విష్ణుప్రసాద్, కలెక్టరేట్ యూనిట్ సెక్రెటరీ లోకేశ్‌రెడ్డి, ఏపీజేఏసీ మహిళా విభాగం చైర్‌పర్సన్ సహారాబాను, సభ్యులు లోకేశ్వరి, శివరామ్, దినేష్, రాజశేఖర్, కృష్ణవేణి ఉన్నారు.

కర్నూలు న్యూసిటీ: కలెక్టర్ సిరిని శనివారం పంచాయతీరాజ్ కర్నూలు డివిజన్ ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మహేశ్వరరెడ్డి, ఎస్ఈటు పీఏ శ్రీనివాసులు కలెక్టరేట్‌లో కలిసి బొకేను అందజేసి అభినందనలు తెలిపారు. మాల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో జేఏసీ చైర్మన్ యాట ఓబులేసు, గిరి క్రాంతికుమార్, శివశంకర్, బేడ బుడగ జంగం రాష్ట్ర అధ్యక్షుడు తూర్పాటి మనోహర్, చింతలయ్య, జయరాముడులు కలెక్టర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు బొకే ఇస్తున్న రెవెన్యూ అధికారులు

హరిహర క్షేత్రంలో కలెక్టర్ పూజలు

కర్నూలు కల్చరల్: కలెక్టర్ సిరి శనివారం ఉదయం నగరంలోని సంకల్‌బాగ్‌లోని హరిహర క్షేత్రంలో వేంకటేశ్వరస్వామి , రామలింగేశ్వర స్వామివార్లకు పూజలు నిర్వహించారు. కలెక్టర్‌కు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సందేల్ చంద్రశేఖర్, ఇతర ప్రతినిధులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో కర్నూలు తహసీల్దార్ రవికుమార్, ఆలయ పాలక మండలి గౌరవాధ్యక్షుడు సీవీ దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు కంచు గంటల శ్యామసుందర్ రావు, ప్రధాన కార్యదర్శి చల్లా నాగరాజ శర్మ, గౌరవ సలహాదారు టీవీ రవిచంద్రశర్మ, వేద పండితులు మామిళ్లపల్లి రాజేశ్ శర్మ, చింతలపల్లి మురళి, అర్చకులు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న కలెక్టర్ సిరి

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే దస్తగిరి

కర్నూలు రూరల్ సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సి.బెళగల్ మండలం కొత్తకోట గ్రామానికి చెందిన చాకలి బజారికి సీఎఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.65,278వేల చెక్కును శనివారం కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అందజేశారు. చాకలి బజారి గత కొంత కాలంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకునేందుకు ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి కోడుమూరు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే సీఎం సహాయ నిధి కింద దరఖాస్తు చేయించారు. రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి బజారికి చికిత్స చేయించుకునేందుకు రూ.65,278వేలు మంజూరు చేయించారు.

● గూడూరు మండలం బూడిదపాడు గ్రామానికి చెందిన వంగూరు నగేష్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి చికిత్స చేయించుకున్నారు. బాధితుడు ఆర్థిక పరిస్థి తులు బాగలేనందున సాయం కోసం ఎమ్మెల్యే దస్తగిరిని సంప్రదించారు. స్పందించిన ఎమ్మెల్యే ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.36,795లను రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మంజూరు చేయించారు. మంజూరైన చెక్కును ఎమ్మెల్యే తన స్వగృహంలో నగేష్‌కు అందజేశారు.

పాత టైం టేబుల్ ప్రవేశ పెట్టాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో ఉపాధ్యాయులకు పాత టైం టేబుల్ ప్రవేశ పెట్టాలని ఎస్టీయూ గురుకుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు కే.లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం స్థానిక సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల టీచర్ల జిల్లా సమావేశం జరిగింది. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గురుకులాల్లో జీవో.నెం.46 (ఎస్ఓపీ) ప్రకారం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు టైం టేబుల్ అమలులో ఉందని, రాష్ట్రంలోని చాలా గురుకులాల్లో క్వార్టర్స్ లేవన్నారు. కావున పాత టైంటేబుల్ 8.45 గంటల నుంచి 4 గంటల దాకా అమలు చేసినా స్టాండర్డ్ ఆఫీసన్ ప్రొసీజర్ జీవో.నెం.46 ప్రకారం విధులు కొనసాగించవచ్చని తెలిపారు. ఎస్టీయూ గురుకులాల విభాగం సీనియర్ నాయకుడు నబీ రసూల్ మాట్లాడుతూ గురుకులాల్లో క్వార్టర్స్‌కు గత ఒకటిన్నర సంవత్సరం నుంచి ఎస్ఆర్ఏ పేరుతో దాదాపు రూ.8వేల నుంచి 15వేల వరకు వసూలు చేస్తున్నారన్నారు. నిర్ణీత హెచ్ఆర్ఏ వసూలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి కిరణ్ రాజు, జిల్లా అధ్యక్షుడు ప్రదీప్, రాష్ట్ర కార్యదర్శి ఎన్.కిరణ్ రాజు, విజయబాస్కర్ రెడ్డి, నరసింహా స్వామి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన ఉండాలి

కల్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో ప్రథమ చికిత్సపై విద్యార్థులకు అవగాహన ఉండాలని కల్లూరు మండల ప్రత్యేకాధికారి, సెట్కూరు సీఈఓ వేణుగోపాల్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ప్రథమ చికిత్స దినోత్సవం సందర్భంగా లక్ష్మీపురం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.

నేడు టీజీవీ కళాక్షేత్రంలో 'పుంజుతోక' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఆదివారం ఉదయం 10 గంటలకు 'పుంజుతోక' కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో ఐపీఎస్ అధికారిగా వివిధ హోదాల్లో సేవలు అందించి, తెలంగాణలో డీజీపీ హోదాలో పదవీ విరమణ చేసిన కొత్తకోట శ్రీనివాసరెడ్డి రచించిన పుస్తకమే పుంజుతోక అని తెలిపారు. ఈ కార్యక్రమానికి పుస్తక ఆవిష్కర్తగా తిరుపతికి చెందిన ప్రముఖ రచయిత ఆర్.ఎం. ఉమామహేశ్వరరావు, ముఖ్య అతిథిగా రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి. పుల్లయ్య విచ్చేస్తారని తెలిపారు. కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో పుస్తక సమీక్షకులుగా ప్రముఖ రచయితలు డాక్టర్ ఎం.హరికిషన్, డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని వ్యవహరిస్తారన్నారు. గౌరవ అతిథులుగా నరసం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ దండెబోయిన పార్వతీదేవి, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు కెంగార మోహన్ పాల్గొంటారన్నారు. రచయిత పరిచయం రవీంద్ర-సుబ్బయ్య పీబీవీ సుబ్బయ్య చేస్తారని, కవితాలాపన గజల్ గాయకుడు మహ్మద్ మియా, కె.బాలవెంకటేశ్వర్లు చేస్తారన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

20 ఏళ్ల అనంతరం కలుసుకున్న స్నేహితులు



గురువులతో పూర్వ విద్యార్థులు

కల్లూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. శనివారం కల్లూరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం హుసేన్ ఆధ్వర్యంలో 2004-05 బ్యాచ్ విద్యార్థులు కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. పాఠశాల రోజుల్లో చేసిన చిలిపి పనులను గుర్తు చేసుకున్నారు. అనంతరం 2004-05 బ్యాచ్ విద్యార్థుల ఆర్గనైజర్స్ దామోదర్, మాబాషా, రమేష్, అంజి, నరసన్న, సుధాకర్, పరుశురాం, వాణి, శైలజ, ప్రసన్న, రేవతి ఆధ్వర్యంలో గురువులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు రత్నం ఏసేపు, వాసుదేవయ్య, సాయిలీల, బాబయ్య, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు అందించడం అభినందనీయం



మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించడం అభినం దనీయమని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శని వారం మండలంలోని కోటేకల్ గ్రామం దగ్గర ఉన్న దయాల్భాగు రాధా స్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50వ హోమియో వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొని ప్రసం గించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు భాస్కర్ రెడ్డి, నిర్వాహ కులు, సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా కోల్స్ దొర జయంతి

కర్నూలు న్యూసిటీ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలో కోల్స్ అకర్‌మాన్ దొర జయంతి వేడుకలు, కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి 107వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం జీసస్ సోల్జర్స్ అకర్‌మాన్ ఇంట ర్నేషనల్ మినిస్ట్రీస్, సీసీ చర్చ్ సంఘ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ మేడికొండ మనోహ హాజరై కోల్స్ దొర విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో కే.రాజారావు, బి.విజయ్‌కుమార్, ఫాస్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు బకాయిలు చెల్లించాలి

కర్నూలు ఎడ్యుకేషన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన ఆర్థిక బకాయిలను వెంటనే చెల్లించి ఇంటీరియం రిలీఫ్ (ఐఆర్) ప్రకటించి పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని పీఆర్‌టీయూ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వి.కరుణానిధి మూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ప్రభుత్వ టౌన్ మోడల్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగింది. కరుణానిధి మూర్తి మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, పాఠశాలల ప్రగతికి నిరంతరం కృషి చేయాలని సూచించారు. అనంతరం పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్‌వీ కృష్ణారెడ్డి, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంటు రవిప్రకాష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయలు మాట్లాడారు. దసరా సెలవులను సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, గ్రేడ్ 2 ప్రధానోపాధ్యాయులుగా పదోన్నతి పొందిన ఉపాధ్యాయులు, ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని జిల్లా శాఖ ఆధ్వర్యంలో సత్కరించారు. జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంటు కేవీ రమణయ్య పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

కర్నూలు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి అన్నారు. శనివారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో స్పందాన్ష్ ఇన్‌ఫ్రా ప్రాజెక్టు ప్రతినిధి కుమారి హన్సిక సహకారంతో మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పిలుపు మేరకు మాకా నామ్ ఏక్ పేడ్ నినాదం స్ఫూర్తితో కళాశాలలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు.

టమోటాను ప్రభుత్వమే కొంటుంది

- రైతులు ఆందోళన చెందవద్దు : పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి



పత్తికొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రైతులు ఆందోళన చెందవద్దని ప్రభుత్వమే గిట్టుబాటు ధరతో టమోటాను కొనుగోలు చేస్తుందని పత్తికొండ మార్కెట్‌యార్డు చైర్మన్ ఆలంకొండ నబి అన్నారు. శనివారం మార్కెట్‌యార్డులో విలేకర్లతో మాట్లాడారు. నాలుగు రోజులుగా ధర పడిపోవడంతో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని, స్పందించిన సీఎం రైతులకు కిలో రూ.7ల నుంచి రూ.8ల ప్రకారం రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ మేరకు మార్కెటింగ్ అధికారుల నుంచి ఆదేశాలు అందడంతో శనివారం పత్తికొండ మార్కెట్‌యార్డులో మార్కెటింగ్ శాఖ నాణ్యతను బట్టి కిలో రూ.7నుంచి 8లకు ప్రకారం టమోటాను కొనుగోలు చేసిందన్నారు. రైతులు మార్కెట్‌కు గ్రేడింగ్ చేసిన టమోటాను తీసుకొచ్చి సహకరించాలని ఆయన కోరారు.

దేవనకొండ వాసికి డాక్టరేట్


మాధవరావు

దేవనకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన మాధవరావుకు ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. కడప జిల్లాలోని వేంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో లైబ్రేరీ సైన్స్ అధ్యాపకుడిగా పని చేస్తూ 'యూజ్ ఆఫ్ పిరియాడికల్స్ బై ది ఫ్యాకల్టీ అండ్ రిసెర్చ్ స్కాలర్స్ ఇన్ ఆంధ్ర అండ్ ఏస్వీ యూనివర్శిటీ లైబ్రరీస్ -ఏ స్టడీ' పరిశోధన సమర్పించడంతో ఎస్వీ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసినట్లు మాధవరావు తెలిపారు. నాలుగేళ్లుగా విశ్లేషణాత్మకంగా పరిశోధన చేశానన్నారు. డాక్టరేట్ పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కనకదాసు విగ్రహం ధ్వంసం హేయం

ఆలూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్య అని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురువ శశికళ అన్నారు. శనివారం ఆలూరు సీఐ రవి శంకర్‌రెడ్డిని కలిసి దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. అనంతరం మణేకుర్తి గ్రామంలో ధ్వంసమైన కనకదాసు విగ్రహాన్ని పరిశీలించారు. పోలీసులు పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి దుండగులను పట్టుకోవాలన్నారు.


విగ్రహాన్ని పరిశీలిస్తున్న శశికళ

దుండగులపై చర్యలు తీసుకోవాలి

హాలహర్వి: మణేకుర్తి గ్రామంలో కనకదాసు విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని వైసీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు శశికళ డిమాండ్ చేశారు. శనివారం హాలహర్విలో కనకదాసు విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేయాలని కోరారు. మాజీ ఎంపీపీ బసప్ప, రమేష్, నిట్రవట్టి, బసప్ప తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత


పట్టణంలోని తిమ్మారెడ్డి బస్టాండు వద్ద ప్రధాన రహదారిపై భారీ గుంతలు పడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మాధవరం రోడ్డుకు వెళ్లే ప్రధాన రహదారిపై భారీ వర్షాల నేపథ్యంలో గుంతల్లో నీరు చేరి ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రహదారులకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు. - ఆదోని అగ్రికల్చర్


మద్దికెర నుంచి బుగ్గ, కసాపురం వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా ఉంది. రంగమ్మ కుంట సమీపాన పెద్ద గుంత ఉండటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. చిన్నపాటి వర్షం పడినా గుంతలో వర్షపు నీరు నెలల తరబడి నిల్వ ఉంటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం మట్టివేసి పూడ్చాలని కోరుతున్నారు. - మద్దికెర

వర్షం.. ఎంతో నష్టం

- ఆదోని పట్టణం ఎంజీ కాలనీలో తగ్గని వరద నీరు
- పత్తికొండ, ఆస్పరి మండల పొలాల్లో వర్షపునీరు
- దేవనకొండలో కూలిన మట్టిమిద్దె


ఆదోని ఎంజీ కాలనీలోఎర్రజెండా పాతిస్తున్న కమిషనర్ కృష్ణ


పెద్ద కాలువ


ఆస్పరిలో నీట మునిగిన మిరప పంట


దేవనకొండలో కూలిన మట్టిమిద్దె

ఆదోని టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వర్షం తగ్గినా కాలనీల్లో వరద నీరు చేరి ప్రజలు అవస్థలు పడుతున్నారు. రాంజల చెరువు నిండి పొర్లడంతో పక్కనే ఉన్న ఎల్‌ఐజీ, ఎంఐజీ, ఎన్‌జీవోస్ కాలనీ రోడ్లన్నీ జలమయ్యాయి. కాలువ ఏదో రోడ్డేదో అర్థం కావడం లేదు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ, హెల్త్ ఆఫీసర్ డా. సందీప్ కుమార్ సిబ్బందితో కలిసి కొన్ని చోట్ల ప్రమాద సూచికగా ఏరుపు జెండాలను ఏర్పాటు చేశారు. వరద నీటిని తొలగించే చర్యలు చేపట్టారు. ప్రజలకు అందుబాటులో ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

చిన్నహుల్తి, పెద్దహుల్తి గ్రామాల్లో నీట మునిగిన పంటలు

పత్తికొండ టౌన్: రెండు రోజుల నుంచి కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగి రైతులు నష్టపోయారు. పెద్దహుల్తి, చిన్నహుల్తి గ్రామాలకు ఆనుకుని హంద్రీవంక ఉంది. ఎగువన కురిసిన వర్షాలతో వందక పొంగి పొలాల్లోకి నీరు చేరింది. దీంతో కంది, సజ్జ తదితర పంటలన్నీ దెబ్బతిన్నాయి. పెద్దహుల్తి గ్రామానికి చెందిన రైతులు హుల్తెప్ప, మహానంది తమకు నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.

నష్ట పరిహారం కోసం ఎదురుచూపులు

ఆస్పరి: ఎడతెరిపిలేని వర్షాలతో ఖరీఫ్ పంటలు నీట మునిగి దెబ్బతిన్నాయి. మండలంలో సుమారు 20 వేల ఎకరాలకు పైగా ఆయా పంటలు సాగుచేశారు. తేమశాతం అధికం కావడంతో పత్తి, మిరప, చిక్కుడుకాయ, వంకాయ, చోళకాయ కుళ్లిపోతున్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు పంటలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. తాను 5 ఎకరాల్లో మిరప, చిక్కుడుకాయ సాగుచేశానని పంటలు నీటమునగడంతో నష్టపోయానని ప్రభుత్వం పరిహారం ఇవ్వాలని ఆస్పరికి చెందిన రైతు మహానంది కోరారు.


పత్తికొండ మండలంలో దెబ్బతిన్న కందిని చూపుతున్న రైతులు

కూలిన మట్టిమిద్దె

దేవనకొండ: శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి కోటకొండ గ్రామంలో మట్టి మిద్దె కూలింది. బాధితుడు చాకలి వీధికి చెందిన గిడ్డయ్య తెలపిన మేరకు.. అర్ధరాత్రి ఇంట్లో భార్య నాగమ్మతో కలిసి నిద్రిస్తుండగా కూలిపోయే ముందు వచ్చే శబ్దాలు వచ్చాయి. దీంతో పరుగు పరుగున ఇద్దరు బయటకు వచ్చారు. అంతలోనే మిద్దె కూలిపోయింది. ప్రాణనష్టం తప్పడంతో ఊపిరి పీల్చుకున్నారు. గిడ్డయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.





● యువతా.. జాగ్రత్త!

పట్టణంలోని రాంజల చెరువు వర్షపు నీటితో పూర్తి స్థాయిలో వర్షం నీండటంతో ప్రజలు వస్తున్నారు. అయితే కొందరు యువత అజాగ్రత్తగా వ్యవహరిస్తుండంతో ప్రమాదం పొంచి ఉంది. ఇనుక కడ్డీలపై అజాగ్రత్తగా కూర్చుంటున్నారు. ఏమాత్రం పట్టు జారినా, చెరువులో పడిపోయే అవకాశముంది. - ఆదోని టౌన్



ఆర్థిక సాయం

దేవనకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీకి చెందిన బోయ మాదేవి కిడ్నీ వ్యాధితో శనివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు బడిగింజల రంగన్న, ఆకుల వీరేష్ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. జనసేన నాయకుడు ఎ.ఉచ్చీరప్ప మరో రూ.5 వేలు అందజేశారు. మాల బండ్లయ్య, రాముడు తదితరులు ఉన్నారు.

రేపటి నుంచి బైకు జాతా

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి సోమవారం నుంచి 19 వరకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో రణభేరి బైకు జాతను నిర్వహిస్తున్నట్లు జిల్లా కౌన్సిలర్ లింగన్న, రంగప్ప అన్నారు. శనివారం మండలంలోని దొడ్డనకేరి జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం వెంకటస్వామి పోస్టర్లను విడుదల చేశారు. కర్నూలు నుంచి కోడుమూరు మీదుగా పత్తికొండ గుంతకల్ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా బైక్ జాత వెళ్తుందన్నారు. పెండింగ్‌ల బకాయిలను చెల్లించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులను అప్పగించకూడదన్నారు. శ్రీనివాసులు నారాయణమ్మ శిరీష శ్రీధర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

ఐఆర్ ప్రకటించాలి

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ ఉపాధ్యాయులకు ప్రభుత్వం దసరా పండుగకైనా 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని ఎస్‌టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీరచంద్ర యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాలలో మాట్లాడుతూ నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని కనీసం రెండు డీఏలైనా ప్రకటించాలన్నారు. జీ శ్రీనివాసులు, బీ శ్రీనివాసులు, నిరంజన్ రెడ్డి, జయరాం పాల్గొన్నారు.

ఆవుల నుంచి కాపాడాలి

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రహదారుల్లో తిష్టవేసిన ఆవుల నుంచి కాపాడాలని సీపీఎం, సీఐటీయూ నాయకులు వెంకటేశ్వరరెడ్డి, రవిచంద్ర కోరారు. శనివారం సీఐ జయన్నకు వినతి పత్రం అందించారు. పశువుల సంచారంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారని పంటను కూడా నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. యజమానులు గోవులను ఇంటివద్దే కట్టివేసుకునేలా చూడాలని కోరారు. స్పందించిన సీఐ ఇకపై ఆవులు బయట కనిపిస్తే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

ప్రైవేటీకరణ ఆపాలి


కర్నూలు రహదారిపై బైఠాయించిన నాయకులు

ఆదోని అగ్రికల్చర్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను ఆపాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి భాస్కర్, వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం ఆదోని శివారులో మెడికల్ కళాశాల వద్ద కర్నూలు రహదారిపై బైఠాయించి గంటసేపు నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 10 మెడికల్ కళాశాలను పీపీపీకి అప్పగిస్తామని క్యాబినేట్ తీర్మానించడం దుర్మార్గమన్నారు. వైద్య విద్యను కార్పొరేట్ చేతుల్లో పెడుతున్నారని ఆరోపించారు. ట్రాఫిక్ స్తంభించడంతో పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు. అఖండ, కార్యదర్శి మహేంద్ర బాబు, ఉపాధ్యక్షుడు రమణ, సహాయ కార్యదర్శి మల్లికార్జున, మునిస్వామి రసూల్ ఉన్నారు.

హెల్మెట్ ధరించండి

ఆదోని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోవాలని ట్రాఫిక్ సీఐ అబ్దుల్‌గౌస్ సూచించారు. శనివారం ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటించాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు, రిజిస్ట్రేషన్, బీమా, డ్రైవింగ్ లైసెను రికార్డులను వాహనంలో ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మన్న ఉన్నారు.


మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ అబ్దుల్ గౌస్

అర్ధరాత్రి నిలిచిన బస్సు

తుగ్గలి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బెంగుళూరు నుంచి మంత్రాలయానికి వెళుతున్న కర్ణాటక బస్సు శనివారం తెల్లవారు జామున నిలిచిపోయింది. రాతన గ్రామం వద్దకు రాగానే ఇంజన్‌లో సమస్య వచ్చి ఆగిపోయినట్లు డ్రైవర్ తెలిపారు. అర్ధరాత్రి కావడంతో ప్రయాణికులు ఆందోళన చెందగారు. ఉదయం ప్రయాణికులను మరో బస్సులో తరలించారు.

బీమా సఖికి దరఖాస్తు చేసుకోవాలి

మద్దికెర సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎల్ఐసీ సౌజన్యంతో అమలు చేస్తున్న బీమా సఖికి మహిళలు దరఖాస్తు చేసుకోవాలని వెలుగు ఏపీఎం రామాంజనేయులు కోరారు. శనివారం మాట్లాడుతూ 18 సంవత్సరాలు పైబడి 70 సంవత్స రాల్లోపు, పదో తరగతి పాసైనవారు అర్హులన్నారు.

వర్షాలతో జాగ్రత్త

తుగ్గలి, సెప్టెంబరు 13 (ఆంధ్ర జ్యోతి): వర్షాలు కురుస్తుండటంతో పొలాలకు వెళ్లే సమయంలో రైతులు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్ రవి సూచించారు. శనివారం మాట్లాడుతూ వర్షం కురిసే సమయంలో చెట్ల కింద, పాత గోడల కింద ఉండవద్దన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగులు, వంకలను దాటవద్దని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

కాలనీలో ఇబ్బందులు


విజయనగర్ కాలనీవాసులతో మాట్లాడుతున్న కృష్ణమ్మ

ఆదోని, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగర్ కాలనీలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని టీడీపీ సీనియర్ నాయకురాలు గుడిసె కృష్ణమ్మ అన్నారు. శనివారం కాలనీలో ఆమె పర్యటించారు. భారీ వర్షాలతో కాలనీలో నడిచేందుకు కూడా వీలులేకుండా ఉందని, పందులు స్వైర్యవిహారం చేస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. వెంటనే మున్సిపల్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తాత్కాలిక రోడ్లు ఏర్పాటు చేసి నీటిని బయటకు పంపేలా చేయాలని డిమాండ్ చేశారు. మండిగేరి బాబురావు, లక్ష్మీనారాయణ, నాగరాజు, భరత్, రాఘవరెడ్డి, విజయ్, రసూల్ పాల్గొన్నారు.

నేడు చేనేత కార్మిక జిల్లా మహాసభ

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నాగలదిన్నెలో ఆదివారం చేనేత కార్మిక 8వ జిల్లా మహాసభ నిర్వహిస్తున్నారని, జయప్రదం చేయాలని చేనేత సంఘం తాలుకా కార్యదర్శి కాలప్ప పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో కే లక్ష్మన్న అధ్యక్షతన జరిగిన చేనేత కార్మికుల సమావేశంలో కాలప్ప, హనుమంతు మాట్లాడుతూ చేనేత కార్మికుల జీవన ప్రమాణాలు చాలా దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సభకు రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు పిల్లలమర్రి బాలకృష్ణ, రాజు, లక్ష్మన్న హాజరవుతారని తెలిపారు. శనివారం జరిగిన సభలో ఇటీవల మరణించిన చేనేత రాష్ట్ర ఉపాధ్యక్షుడు జేఎస్ శేషయ్యకు ఘన నివాళి అర్పించారు. కృష్ణ, శీను, తిమ్మప్ప, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఎమ్మిగనూరు రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అలుపెరుగని పోరాటాలు చేసిన సురవరం సుధాకర్‌రెడ్డి 17వ సంస్మరణ సభను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పంపన్నగౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న కోరారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఎమ్మిగనూరు, నంద వరం, గోనెగండ్ల మండలాల కార్యదర్శులు రాజీవ్, గిడ్డయ్య, శ్రీరాములు, కేసీ జబ్బార్, దాదావలి, మాలిక్, విరుపాక్షి నాయుడు, వీరేష్, తిమ్మగురుడు, విజయేంద్ర పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 577 కేసులు పరిష్కారం


కేసులను పరిష్కరిస్తున్న న్యాయాధికారి లక్ష్మీరాజ్యం

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మెజిస్ట్రేట్ కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో అదనపు జిల్లా న్యాయాధికారి వి. లక్ష్మీరాజ్యం ఆధ్వర్యంలో 577 వివిధ కేసులను పరిష్కరించినట్లు పట్టణ సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో రాజీ కేసులు క్రిమినల్, భూతగాదా, సారాయి, పబ్లిక్ న్యూసెన్స్, ప్రామిసరీ నోట్ మొదలగు కేసులను అదనపు జిల్లా న్యాయాధికారి వి.లక్ష్మీరాజ్యం, ఏపీపీ శ్రీలత, సాల్మన్, లోక్ అదాలత్ మెంబర్ రషీదుల్లా పాల్గొని వివిధ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో మొత్తం 577 కేసులు, రాజీ కేసులు 26, సివిల్ దావలు 2, సారాయి కేసులు 7, అడ్మిషన్ కేసులు 542లను పరిష్కారం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో దామోదర్ రెడ్డి, మురళీ కృష్ణ, కోర్టు కానిస్టెబుల్స్ రామాంజనేయులు, మోహన్ పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దశమి మహోత్సవం


అశ్వాన్ని ఊరేగిస్తున్న పీఠాధిపతులు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

గోనెగండ్ల, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కొలిచేవారికి కొంగుబంగారంగా, భక్తుల కోర్కెలు తీర్చే చింతాముని నల్లారెడ్డి దశిమి వేడుకలు అంగరంగ వైభవంగా శనివారం ప్రారంభ మయ్యాయి. ఆదోని డివిజన్‌లో అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాల్లో గోనెగండ్ల దశిమి ఉత్సవానికి ప్రత్యేక ఉంది. వేల సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దశిమి మహోత్సవం ఐదు రోజుల పాటు వైభవంగా జరునుంది. శనివారం తెల్లవారుజామున పల్లకిసేవతో స్వామి వారి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. దశిమి ఉత్సవంను భక్తులు ఘనంగా నిర్వహించారు. అలాగే 14వతేదిన సాంస్కృతిక కార్యక్రమాలు, 15వతేదిన పారువేట ఉత్సవం, 16వ తేదిన ఆరాధన ఉత్సవంతో స్వామివారి దశిమి ఉత్సవాలు ముగుస్తాయి.

పంటల భవిష్యత్తు తెలిపే అశ్వం నడక..

స్వామి వారి అశ్వసేవ ఎంతో ప్రాముఖ్యతను కలిగి ఉంది. అశ్వాన్ని సాక్షాత్తు స్వామి వారి ప్రతిరూపంగా భక్తులు కొలుస్తారు. దేవాలయ పీఠాధిపతి ఆశ్వాన్ని ప్రత్యేకంగా అలంకరించి దేవాలయంలో పూజలు చేశారు. ఆశ్వాన్ని మేళతాళలతో రాత్రి 2 గంటలకు ఓబిలేసు స్వామి దేవాలయం నుంచి ఊరేగించగా చింతలాముని నల్లారెడ్డి స్వామి దేవాలయానికి చేరుకుంది. దారిలో భక్తులు ఆశ్వానికి పళ్ళు, పూలు సమర్పించారు. ఆశ్వం కదిలే కదలికలను బట్టి ఆ ఎడాది పాడి పంటలు ఉంటాయాని భక్తుల నమ్మకం.

ప్రముఖుల ప్రత్యేక పూజలు:

చింతలాముని నల్లారెడ్డి స్వామివారి దశిమి మహోత్సవానికి సోమవారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే, రాష్ట్ర టీడీపీ ఉపాధ్యక్షుడు బీవీ జయనాగేశ్వరరెడ్డి, తో పాటు మాజీ ఎంపీపీ వైసీపీ మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, మన్సూర్, ఉరుకుందరెడ్డి తో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే

మండల కేంద్రమైన గోనెగండ్లలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల వారి దశిమి మహోత్సవం సందర్భంగా శనివారం స్థానిక ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభించారు. జాతర్లలో ఈ లాంటి పోటీలు ఆరోగ్యకరంగా ఉంటాయని ప్రజలకు ఉత్సాహాన్ని ఇస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, రామాంజినేయలు, బేతాలబడేసా, మహల్ రాహంతుల్ల, నజీర్ సాహెబ్, నూరహమ్మద్, రమేష్ నాయుడు, గ్రామ సర్పంచ్ హైమావతి, అడ్వకేట్ చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, గౌండరహంతుల్లా, రఫీక్, ఫక్రుద్దీన్, మిన్నల్ల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఉల్లి రైతుల సమస్యను సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తా: బీవీ

ఉల్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించి సీఎం చంద్రబాబుతతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రమైన గోనెగండ్లలో ఆయన మాట్లాడుతూ ఉల్లి రైతులు గిట్టు బాటు ధర లేకపోవడంతో చాల ఇబ్బందులు పడుతున్నారు. అయితే ప్రభుత్వం క్వింటం రూ. 1200 లను మద్దతు ధర గా ప్రకటించిందని తెలిపారు.

అంబేడ్కర్ భవనం కోసం పోరాటం

ఎమ్మిగనూరు/టౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేడ్కర్ భవనం నిర్మాణం కోసం దళితులంతా ఏకమై పార్టీలకు అతీతంగా పోరాడదామని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం, భవన సాధన కమిటి అధ్యక్షులు కదిరికోట ఆదెన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఆనంద్ చైతన్య పిలుపునిచ్చారు. సభలో టీడీపీ నియోజవర్గ ఎస్సీ సెల్ నాయకులు హాలహర్వి దావీదు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

మంత్రాలయం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం పట్టణంలో పాతవీదిలో వెలసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయం వెనుకాల పేకాటాడుతుండగా.. మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ దాడులు చేసి పట్టుకున్నారు. శనివారం గ్రామంలో మంత్రాలయం చెందిన 8 మంది పేకాటాడుతుండగా.. తన సిబ్బందితో దాడులు చేసి వారి వద్ద ఉన్న నగదు రూ.28,860లతో పాటు పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.



వాషింగ్ మిషన్లు పంపిణీ


వాషింగ్ మిషన్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నందవరం, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమలగూడురు గ్రామంలో ప్రధాన మంత్రి విశ్వకర్మ పథకం కింద 13 మందికి వాషింగ్ మిషన్లు మంజూరు కాగా వాటిని టీడీపీ నాయకులు వెంకట్రామిరెడ్డి, రామలింగారెడ్డి, గోపాల్‌రెడ్డి రజక సంఘం నాయకులు చంద్ర, శనివారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ రూ 250 కట్టి దరఖాస్తు చేసుకున్న రజకులకు అర్హులైన వారికి 13 వాషింగ్ మిషన్లు వచ్చాయన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసమే శక్తి యాప్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): మహిళల భద్రత కోసమే మహిళా శక్తి యాప్ ప్రత్యేకంగ రూపొందించారని శక్తి టీం బృందం ఏఎస్ఐ నటరాజ్, కానిస్టేబుల్ నాగరాజు అన్నారు. మహిళా శక్తి యాప్‌పై శనివారం ఎర్రకోట గ్రామంలో మల్లికార్జున విద్యామందిర్‌లో విద్యార్థులకు, మహిళా ఉపాధ్యాయులకు, అవగాహన కల్పించారు. హెల్ప్ లైన్లకోసం 112, 1098 నెంబర్లకు ఫోన్ చేయాలన్నారు. మహిళా పోలీసు ఆదిలక్ష్మ, విద్యామందిర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పేదలకు అండగా ప్రభుత్వం'

మంత్రాలయం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం బాగాలేకపోయి సొంత డబ్బులతో చికిత్సలు చేయించుకున్న పేదలకు ప్రభుత్వం ప్రభుత్వం అండగా ఉంటుందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎన్.రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మాధవరం తన నివాసంలో మాజీ సర్పంచ్ రఘునాథరెడ్డి, మంచాల కేడీసీసీ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు చాపల నాగేష్, డీపీ తిమ్మప్ప, క్లస్టర్ ఇన్‌చార్జి వరదరాజు, ఎంపీటీసీ వెంకటేష్, కోసిగి మండల నాయకులు రామిరెడ్డి, ముత్తురెడ్డి, కంసలి నరసింహులు ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధి కింద నాలుగు మండలాల్లోని 40 మందికి మజూరైన రూ. 15,77,420 లక్షలు చెక్కులను పంపిణీ చేశారు. రాకేష్ రెడ్డి, టిప్పు సుల్తాన్, బసలదొడ్డి ఈరన్న, మల్లికార్జున, పాల్గొన్నారు.

'జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించారు'


కలెక్టర్ రంజిత్ బాషాను సన్మానిస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాను ఎంతో అభివృద్ధి పథంలో నడిపించేందుకు కలెక్టర్ రంజిత్ బాషా ఎంతగానో కృషి చేశారని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి అన్నారు. శనివారం రాత్రి బదిలీపై వెళ్తున్న కలెక్టర్ రంజిత్‌బాషాకు శాలువ కప్పి, పూలమాలలు వేసి మెమెంటో అందజేసి ఆయన చేసిన సేవలను కొనియాడారు. జేసి నవ్య, మంత్రాలయం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

804 లీటర్ల కర్ణాటక మద్యం ధ్వంసం

కోసిగి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం కోసిగిలోని ఆదోని రోడ్డులో ఎక్సైజ్ పోలీసు అధికారులు, స్థానిక పోలీస్ స్టేషన్‌లో దాదాపు 63 కేసుల్లో పట్టుబడిన 804 లీటర్ల అక్రమ కర్ణాటక మద్యాన్ని ఆదోని రోడ్డులో ధ్వంసం చేశారు. సుమారు వీటి విలువ రూ.4,40,000 ఉంటుందని చెప్పారు. అనంతరం అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ మాట్లాడుతూ అక్రమ కర్ణాటక మద్యం ఎవరైనా అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భార్గవ్‌రెడ్డి, స్థానిక ఎస్ఐ హనుమంతరెడ్డి ఉన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టు ఎస్సీకి కేటాయింపు

ఎమ్మిగనూరు టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పార్లపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఆయా పోస్టును బీసీ-డికి బదులుగా ఎస్సీ గ్రూపు-2 కేటాయించినట్లు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి సఫరున్నిసా తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రం-1లో ఖాళీగా ఉన్న ఈ పోస్టు రిజర్వేషన్ మార్పును గమనించాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారి సఫరున్నిసా తెలిపారు.

ఉల్లి రైతులు అధైర్యపడొద్దు: ఎమ్మెల్యే


మార్కెట్ కమిటీలో ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉల్లి రైతులు అధైర్యపడొద్దని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి సూచించారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో శనివారం పర్యటించారు. మార్కెట్‌లో నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. అలాగే వేరుశనగను పరిశీలించారు. అలాగే దుకాణాల వెనుక ఖాళీగా ఉన్న స్థలాన్ని, భయటకు వెళ్లే రహదారిని పరిశీలించారు. ఎమ్మెల్యే విలేకరులతో మట్లాడుతూ రైతులు సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉల్లి రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మద్దతు ధర రూ. 1200 ప్రకటించిందన్నారు. ఉల్లి రైతుల కష్టాలను, నష్టాలను జిల్లా కలెక్టర్, వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లానాన్నారు. పత్తి క్రయవిక్రయాలు జరిగే చోట కూరగాయల మార్కెట్ జరుగుతుందని వారికి మార్కెట్‌లోనే స్థలం చూశామని అక్కడ కేటాయించి, మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లయ్య, ప్రత్యేక శ్రేణి కార్యదర్శి చంద్రమౌళి, వైస్ చైర్మన్ అంజి, నాయకులు మహేష్, దావీదు, బుగుడే నాగరాజు, బచ్చాల రంగన్న, కర్రెన్న, రాజేష్, కమీషన్ ఏజెంట్ల సంఘం, హమాలీల సంఘం నాయకులు పాల్గొన్నారు.

కోసిగిలో చిరుత సంచారం

కోసిగి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోసిగిలోని రైల్వేస్టేషన్ రోడ్డులోని తిమ్మప్పకొండకు ఆనుకుని ఉన్న ఇండియన్ పెట్రోల్ బంకు ఎదురుగా ఉన్న కాలనీలో శుక్రవారం అర్ధరాత్రి దాటాక చిరుత పులి ఇళ్ల ముందే వెళ్లడంతో కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు. రాత్రి వేళ బయటకువచ్చిన కొందరు యువకులు ఇళ్ల ముందే చిరుత పులి సంచారం చూసి భయంతో వణికిపోయారు. పక్కనే బీజేపీ కార్యాలయం లోకి చిరుత పులి వెళ్లడంతో స్థానిక కాలనీవాసులు భయాబ్రాంతులకు గురయారు. తిమ్మప్పకొండ కూడా కాలనీకి ఆనుకుని ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతు న్నారు. ఇప్పటికైనా ఫారెస్టు అధికారులు చిరుతపులిని బంధించాలని కోరుతున్నారు.

శ్రీమఠంలో వెండి రథోత్సవం


వెండి రథంపై విహరిస్తున్న ప్రహ్లాదరాయలు

మంత్రాలయం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి మఠంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. శనివారం భాద్రపద షష్ఠి శభదినాన్ని పురస్కరించుకుని శ్రీ మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు ఊంజల మంటపంలో ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయలను అధిష్టించి ఊంజలసేవ నిర్వహించారు. రెండవ శనివారం, ఆదివారం సెలవుదినాలు కావటంతో ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ధార్మిక పర్యటన ముగించుకుని శనివారం మంత్రాలయంకు చేరుకురని మఠం మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి తెలిపారు.

వైద్యసేవలు అందించడం అభినందనీయం


మాట్లాడుతున్న ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఎమ్మిగనూరు, సెప్టెంబర్ 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతప్రజలకు ఉచితంగా ఆరోగ్య సేవలు అందించటం అభినందనీయమని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. శనివారం మండల పరిధిలోని కోటేకల్ గ్రామం దగ్గర ఉన్న దయాల్బాగు రాధా స్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 50వ హోమియో వైద్యశిబిరం ప్రారంభ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు భాస్కర్ రెడ్డి, నిర్వాహకులు, సిబ్బంది, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

మంత్రాలయం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం విఠోభరావు, ఫిజికల్ డైరెక్టర్లు రవీంద్ర, నరసింహరాజు తెలిపారు.కర్నూలులో జరిగిన పోటీల్లో జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైయ్యారని తెలిపారు. సెపక్‌తక్రా బాలుర అండర్-14 విభాగంలో రమేష్, విజయ్, బాలికల విభాగంలో తనూశ్రీ, అంజలి, అండర్-17 సెపక్‌తక్రా విభాగంలో రామనాయుడు, బాలికల విభాగంలో పద్మశ్రీ, అఖిల, అండర్-19 విభాగంలో రాధమ్మ, రుతిక ఎంపికయ్యారని తెలిపారు.

'రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి'


రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

కౌతాళం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బదినేహల్ గ్రామం నుంచి ఆదోని మండలం జి.హోసళ్ళికి పోవు రోడ్డు పూర్తిగా దెబ్బతిని వాహనాల రాకపోకలు లేకుండా ఉందని కూటమి ప్రభుత్వంలో గుంత రోడ్లకు కనీసం మరమ్మతులు చేపట్టి రాకపోకలు కొనసాగేలా చూడాలంటూ సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. గుంతలను కూటమి ప్రభుత్వం పూడ్చలంటూ గుంతల రోడ్లపై వరినాట్లు వేసి నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శంకర్, చందాసాబ్, బందేనవాజ్, రమేష్ ఉన్నారు.

మొక్కలు నాటాలి

నందవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు ఓ మొక్క నాటి వాటిని సంరక్షించి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ దేశాయి మాధవరావు అన్నారు. శనివారం నందవరంలో ఆయన మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీలర్ నరసింహులు, బెస్తా ఈరన్న, మల్లి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.